# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | మంగళవారం 5-5-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 242 | పేజీలు:4 | వెల: రూ.1/-


## దేశం 42,533కి చేరిన కరోనా కేసుల సంఖ్య
## ఇప్పటివరకు 1,373 మంది మరణం

న్యూఢిల్లీ,మే4(ఆర్‌ఎన్‌ఎ): దేశంలో గత 24 గంటల్లో 2,553 కరోనా పాజిటివ్ కేసులు నమోవగా, 73 మంది మరణించారు. కరోనా కేసులకు సంబంధించిన హెల్త్ బులిటెన్‌ను కేంద్ర ఆరోగ్య శాఖ విడుదల చేసింది. దీనిప్రకారం దేశంలో మొత్తం కరోనా కేసుల సంఖ్య 42,533కి చేరింది. ఈ వైరస్ ప్రభావంతో దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 1,373 మంది మరణించారు. దేశంలో ప్రస్తుతం 29453 యాక్టివ్ కేసులు ఉండగా, 11,707 మంది బాధితులు ఈ వైరస్ నుంచి కోలుకున్నారు. మొత్తం నమోదైన కేసుల్లో 27.5 శాతం మంది కోలుకోగా, మరణాల శాతం 3.25గా నమోదయ్యింది.

# కరోనా నేపథ్యంలో ఫార్మాసిటీకి పెరిగిన ప్రాధాన్యం

### అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నాం
### ఫార్మాసిటీ కోసం సాయం చేయాలని కేంద్రాన్ని కోరాం: కెటీఆర్

హైదరాబాద్,మే4(ఆర్‌ఎన్‌ఎ): అంతర్జాతీయంగా ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణలోని ఫార్మాసిటీలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.4 వేల కోట్ల సహాయంచేయాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. ఫార్మాసిటీని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నామని, కొవిడ్-19 నేపథ్యంలో వ్యాక్సిన్, డ్రగ్ ప్రాధాన్యం తెలిసిన తరువాత ఫార్మాసిటీ ప్రాముఖ్యం మరింత పెరిగిందన్నారు. ఫార్మాసిటీ కోసమే 900 మెగావాట్ల విద్యుత్తు అవసరం ఉంటుందని, ఇందుకోసం రూ.1200 నుంచి రెండువేల కోట్ల రూపాయల వరకు ఖర్చవుతుందని చెప్పారు. నీటి అవసరాలకోసం మరో రెండువేల కోట్ల రూపాయలు అవసరమవుతాయని తెలిపారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు లేఖ రాశానని వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా వైరస్ విజృంభించిన నేపథ్యంలో వివిధ దేశాలు, పెట్టుబడిదారులు సురక్షిత ప్రాంతాలను అన్వేషిస్తున్నారని తెలంగాణ పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు.

ఈ క్రమంలో భారతదేశంలో పెట్టుబడులు పెట్టడానికి పలువురు ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. వివిధ కంపెనీలు తమ ఉత్పత్తి యూనిట్లను ఇతర ప్రాంతాలకు మార్చాలని చూస్తున్నాయని వెల్లడించారు. పరిస్థితులను గమనిస్తే పెట్టుబడులకు భారతదేశం మెరుగైనదనే భావన వ్యక్తమవుతున్నదని, కేంద్ర ప్రభుత్వం చురుకుగా వ్యవహరించి మనదేశానికి పెట్టుబడులు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. రాష్ట్రాల్లో పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం నిధులు ఇవ్వాలని పేర్కొన్నారు. చైనా నుంచి వచ్చే పరిశ్రమలను ఆకర్షించడానికి ఇదే మంచి అవకాశమని చెప్పారు. ఉత్పాదకరంగంలో చైనా నుంచి బయట అవకాశాలకోసం చూస్తున్న కంపెనీల్లో సింహభాగం భారతదేశానికి వచ్చేలా చూడాలని సూచించారు. ఇందుకోసం భారీ పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేయాలని, కార్మికచట్టాలను మార్చాలని.. ఈవోడీబీలో భారతదేశం మొదటి ఇరవై దేశాల్లో ఒకటిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు లేఖ రాశానని వెల్లడించారు. కరోనాకు వ్యాక్సిన్‌ను కనుక్కోవడానికి ఇప్పటికే ప్రయత్నాలు మొదలైనా.. దాని ప్రభావాన్ని నిరూపించాల్సి ఉంటుందని తెలిపారు. ఇందుకోసం సమయం పడుతుందని.. అప్పటిదాకా కరోనాతో కలిసి బతకడం తప్పనిసరి అని చెప్పారు. కరోనా నియంత్రణలో యావత్ ప్రపంచం భారతదేశాన్ని అభినందిస్తున్నదని చెప్పారు. తెలంగాణలో వైరస్ నియంత్రణ జాతీయ సగటుకంటే, ఇతర రాష్ట్రాలకంటే మెరుగ్గా ఉన్నదని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో పరిశ్రమలకు, ప్రభుత్వానికి ఉద్యోగుల్లో విశ్వాసం కల్పించడం పెద్ద సవాల్ అని పేర్కొన్నారు. వారికి ఆరోగ్యంపై విశ్వాసం కలిగితేనే విధుల్లోకి వస్తారన్నారు. దీనికోసం అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. మాస్కులు, శానిటైజేషన్, సామాజిక దూరం పాటించే విధంగా కార్యాచరణ సిద్ధంచేస్తున్నామని మంత్రి కేటీఆర్ తెలిపారు.



మద్యం దుకాణాలకు అనుమతులు ఇవ్వడంతో ఢిల్లీలో మద్యం కోసం షాపుల ముందు బారులు తీరిన ప్రజలు

# దేశవ్యాప్తంగా తెరుచుకున్న మద్యం షాపులు

### ఉదయం నుంచే క్యూ కట్టిన మందుబాబులు
### ఢిల్లీలో సామాజిక దూరం పాటించక పోవడంతో లాఠీఛార్జ్

న్యూఢిల్లీ,మే4(ఆర్‌ఎన్‌ఎ): దేశవ్యాప్తంగా మందుబాబులు ఊపిరిపీల్చుకున్నారు. చుక్క కోసం ఇన్నాళ్లు తహతహలాడిన జనం ఇప్పుడు తండోపతండాలుగా వైన్ షాపుల వైపు పరుగులు తీసారు. దేశవ్యాప్తంగా వైన్ షాపులను తెరుచుకోవడంతో బాటిల్ కోసం క్యూ కట్టారు. 40 రోజుల లాక్‌డౌన్ తర్వాత పలు రాష్ట్రాల్లో మద్యం షాపులను సోమవారం తెరిచేశారు. దీంతో భారీ సంఖ్యలో జనం షాపుల ముందు నిలబడ్డారు. ఢిల్లీ, ఛత్తీస్‌ఘఢ్, కర్నాటక,ఎపి రాష్ట్రాల్లో వైన్ షాపులను ఓపెన్ చేశారు. ఉదయం నుంచే షాపుల ముందు జనం క్యూ కట్టారు. కొన్ని చోట్ల సామాజిక దూరాన్ని పాటిస్తున్నారు. కొన్ని చోట్ల జనం మరీ ఎక్కువ సంఖ్యలో ఉండడంతో.. సోషల్ డిస్టాన్సింగ్ నియమాన్ని పట్టించుకునేవారు లేరు. కంటైన్మెంట్ జోన్లలో మినహా అనేక ప్రాంతాల్లో మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయి. ఢిల్లీలోని దేశ్ బంధు గుప్తా రోడ్‌లో ఉన్న మద్యం షాపు వద్ద భారీ క్యూలైన్‌లో జనం నిలబడ్డారు. రెసిడెన్షియల్ ప్రాంతాల్లోనూ ఉన్న వైన్ షాపుల్లోనూ మద్యం అమ్మేందుకు అనుమతి ఇచ్చారు. సామాజిక దూరాన్ని పాటించకపోవడంతో.. కశ్మీరీ గేటు ప్రాంతంలో ఉన్న వైన్‌షాపు వద్ద లాఠీచార్జ్ జరిగింది. ఇక ఛత్తీస్‌ఘఢ్‌లోని రాజ్‌నందగావ్ ప్రాంతంలో మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. కానీ జనం ఎవరూ సోషల్ డిస్టాన్సింగ్ నియమాన్ని పాటించడంలేదు. ఆ రాష్ట్రంలో కీలకమైన కంటెయిన్‌మెంట్ జోన్లలో మినహా మిగితా అంతటా మద్యం అమ్మకాలను ప్రారంభించారు. బెంగుళూరులో కూడా జనం లిక్కర్ షాపు ముందు క్యూకట్టారు. ఆ రాష్ట్రంలో ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకు మద్యం అమ్మేందుకు అనుమతులు ఇచ్చారు. ఎపిలో కూడా పెంచిన మద్యం ధరలను లెక్క చేయకుండా క్యూ కట్టారు. కిలోమీటర్ల మేర క్యూలు కట్టారు.

## కరోనా వైద్య సేవల కోసం రజనీకాంత్ రాఘవేంద్ర కళ్యాణ మంటపం

హైదరాబాద్,మే4: ప్రజలని వణికిస్తున్న మహమ్మారి కరోనా కట్టడి కోసం ప్రభుత్వంతో పాటు పలువురు సినీ ప్రముఖులు కలిసి పని చేస్తున్నారు. విరాళాలతో పాటు వారికి సంబంధించిన స్థలాలని వైద్య సేవల కోసం వినియోగించుకోవచ్చని చెబుతున్నారు. ఇప్పటికే షారూఖ్ ఖాన్ తన ఆఫీస్‌ని క్వారంటైన్‌కి ఉపయోగించుకోవచ్చని పేర్కొనగా, విజయ్ కాంత్ తన కాలేజ్ స్థలాన్ని అంత్యక్రియల కోసం వాడుకోచ్చని స్పష్టం చేశారు. ఇక రజనీకాంత్ కొన్ని రోజుల కింద చెన్నైలోని తన రాఘవేంద్ర కళ్యాణ మంటపాన్ని కరోనా వైద్య సేవల కోసం వాడుకోవచ్చంటూ ప్రకటించారు. అయితే గత కొన్ని రోజులుగా దాని అవసరం రాలేదు. కాని ప్రస్తుతం కరోనా కేసులు అంతకంత పెరుగుతూ ఉన్న నేపథ్యంలో చెన్నైలోని కళ్యాణ మంటపాలకు నోటీసులు పంపారు కార్పోరేషన్ అధికారులు. అందులో భాగంగానే కోడంబాక్కంలోని రజనీకాంత్ రాఘవేంద్ర కళ్యాణ మంటపం కూడా సిద్ధంగా ఉంచాలంటూ లేఖ రాసారు. కళ్యాణ మంటపాన్ని కరోనా చికిత్సకు ఉపయోగించుకుంటామని లేఖలో పేర్కొన్నారు

## లాక్‌డౌన్ ఉల్లంఘన.. మణిపూర్‌లో రూ. 2 లక్షలకు పైగా వసూళ్లు

ఇంఫాల్, మే 4: కరోనా వైరస్ ప్రబలుతున్న నేపథ్యంలో దేశ వ్యాప్తంగా లాక్‌డౌన్ అమలవుతోన్న విషయం విదితమే. మణిపూర్‌లో లాక్‌డౌన్ నిబంధనలు ఉల్లంఘించినందుకు గానూ.. ఆ రాష్ట్ర అధికారులు రూ. 2,34,690 వసూళ్లు చేశారు. అత్యధికంగా తౌబాల్ జిల్లాలో లాక్‌డౌన్ నిబంధనలు ఉల్లంఘించినట్లు అధికారులు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా తౌబాల్ ఎస్పీ మాట్లాడుతూ.. లాక్‌డౌన్ అమలు సమయంలో కేవలం నిత్యావసర సరుకులు తెచ్చుకునేందుకు మాత్రమే అనుమతి ఇచ్చామని తెలిపారు. కొందరైతే ఎలాంటి పనులు లేకపోయినప్పటికీ రోడ్లపైకి వచ్చారు. అలాంటి వారిని అదుపులోకి తీసుకుని విచారించగా సరైన సమాధానం చెప్పలేదు. దీంతో వారికి జరిమానాలు విధించినట్లు ఎస్పీ తెలిపారు.

మణిపూర్ వ్యాప్తంగా ఈ 40 రోజుల్లో 24,436 మందిని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు చెప్పారు. 17,351 వాహనాల్ సీజ్ చేశామన్నారు. యువకుడిని అకారణంగా కొట్టినందుకు ఓ పోలీసు అధికారిని సస్పెండ్ చేసినట్లు పోలీసు ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

## పేదలకు నిత్యావసరాలు పంపిణీ: కావ్యారెడ్డి

హైదరాబాద్,మే4(ఆర్‌ఎన్‌ఎ): గ్రేటర్ హైదరాబాద్‌లో పేదలకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆపన్న హస్తం అందించనున్నారు. సుమారు 10 వేల మందికి సాయం చేయనున్నారు. కిషన్ రెడ్డి తరఫున ఆయన సతీమణి కావ్యా రెడ్డి ఈ సాయం చేసేందుకు ముందుకొచ్చారు. ఇదివరకు రెండు, మూడు సార్లు పేదలకు నిత్యవసర వస్తువులు పంపిణీ చేశామన్నారు. సోమవారం 10 వేల మందికి నిత్యావసర వస్తువులు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కరోనా నేపథ్యంలో ఎంతోమంది పేదలు ఆకలితో అలమటిస్తున్నారని, అలాంటివాళ్లకు చేతనైన సాయం చేయాలని ముందుకు వచ్చామని కావ్యారెడ్డి చెప్పారు. కరోనా నేపథ్యంలో లాక్ డౌన్ సమయంలో ప్రతి ఒక్కరూ ఇంట్లోనే ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బయటకు వచ్చినప్పుడు మాస్కులు వేసుకుని రావాలని, సామాజిక దూరం పాటించాలన్నారు. మోదీ కిట్స్ పేరుతో తొమ్మిది రకాల నిత్యవసర వస్తువులను పేద ప్రజలకు అందజేస్తున్నామని కావ్యారెడ్డి స్పష్టం చేశారు.

### చరిత్రలో నేటినిజం



కం॥ జన మానసముల యందున
ఘన దగు ప్రత్యేక శైలి తనదౌ రీతిన
సినిమా రంగము నందున
మను చుండుము దివ్యముగ రమాప్రభ ధాటిలోన!!

(మే 5 రమాప్రభ జననం)

–రాధశ్రీ

సెల్: 9494481210



## పాతబస్తీలో రెండువర్గాల మధ్య గ్యాంగ్ వార్

హైదరాబాద్,మే4(ఆర్‌ఎన్‌ఎ): లాక్‌డౌన్ సమయంలో నగరంలోని పాతబస్తీలో రెండు వర్గాల మధ్య గ్యాంగ్ వార్ జరిగింది. స్థానిక భవానీ నగర్‌లో కొంతమంది యువకులు రెండు వర్గాలుగా విడిపోయి కర్రలు, రాళ్లతో ఘర్షణకు దిగారు. ఆ ఘటనలో పలువురికి తీవ్రగాయాలు అయ్యాయి. రాళ్లు పెద్ద ఎత్తున రువ్వుకోవడంతో స్థానికులు భయాందోళనకు గురైయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి భారీగా చేరుకున్నారు. ఈ క్రమంలోనే ఘటనలో అనుమానితులుగా భావిస్తున్న కొంతమంది యువకులను భవానీనగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానికల సమాచారం ప్రకారం బైక్ పార్కింగ్ విషయంలో రెండు వర్గాల మధ్య గొడవ జరిగినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. గొడవకు కారణమైన వారిపై కేసులు నమోదు చేశామని, ఇప్పటి వరకు ఎనిమిది మందిని అరెస్ట్ చేశామని పోలీసులు వెల్లడించారు. ఘటనపై విచారణ చేపడుతున్నామని తెలిపారు.

## నగరంలో ట్రాఫిక్ కష్టాలు లేకుండా చేయాలి

### నిర్మాణంలోని ప్రాజెక్టులు పూర్తి చేయాలి: కెటిఆర్

హైదరాబాద్,మే4(ఆర్‌ఎన్‌ఎ): నగర ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు లేకుండా చూడాలని పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అధికారులను ఆదేశించారు. నగరంలోని రైల్వే ప్రాజెక్ట పనులు, ఆర్‌వోబీ, ఆర్‌యూబీల నిర్మాణం, భూసేకరణపై జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో దక్షిణమధ్య రైల్వే జీఎం గజానన్ మాల్యా, మేయర్ బొంతు రామ్మోహన్, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్, జలమండలి ఎండీ దానకిశోర్, మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి పాల్గొన్నారు. నగరంలో రోడ్డు నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ వేగంగా చేపడుతున్నదని ఆయన చెప్పారు. పలుచోట్ల రైల్వే ఓవర్ బ్రిడ్జి, రైల్వే అండర్ బ్రిడ్జిలకు సంబంధించిన పనులు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని దక్షిణమధ్య రైల్వే సహకారంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైల్వే శాఖ కూడా జీహెచ్ఎంసీ మాదిరిగా పనులు పూర్తిచేసి నగర ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు లేకుండా చూడాలని సూచించారు. ఎస్ఆర్డీపీ, లింక్ రోడ్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని చెప్పారు. జీహెచ్ఎంసీ పరిధిలో రైల్వే ప్రాజెక్టులను వేగంగా పూర్తిచేయాలని రైల్వే జీఎం గజానన్ మాల్యాను కేటీఆర్ కోరారు. వానాకాలం నాటికి ఎక్కువ చోట్ల రైల్వేకు సంబంధించిన పనులు పూర్తిచేసేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. పనుల పూర్తికి ప్రభుత్వం తరఫున పూర్తిగా సహకరిస్తామని చెప్పారు. జలమండలి మౌలిక వసతుల ప్రాజెక్టులపై రైల్వే జీఎంతో చర్చించారు.

## దర్శకరత్న దాసరికి ఘన నివాళి

హైదరాబాద్,మే4(ఆర్‌ఎన్‌ఎ): సినీ పరిశ్రమలో సంచలనం సృష్టించి పత్రికారంగంలో అద్వితీయమైన ఒరవడిని సృష్టించి ఉదయం దినపత్రికతో సంచలనం రేపిన దిగ్గజ దర్శకేంద్రుడు దర్శకరత్న దాసరి నారాయణ రావు జయంతి సందర్భంగా ఆయనకు పలువురు సినీ, పత్రికా ప్రముఖులు ఘనంగా నివాళి అర్పించారు. ఆయన జయంతిని రోజుని డైరెక్టర్స్ డేగా సినీ ప్రముఖులు జరుపుకుంటారు. సినిమాలు తీయడంలో సాటిలేని గిన్నిస్ రికార్డు సాధించి ప్రేక్షకుల మనసులో సుస్థిర స్థానం సంపాదించిన దాసరి నారాయణరావు ప్రపంచంలోనే అత్యధిక చిత్రాలకు దర్శకత్వం వహించారు. రచయితగా, నిర్మాతగా, దర్శకుడిగా సంచలన విజయాలు సాధించి దర్శకుల విలువను పెంచిన దిగ్గజ దర్శకుడు దర్శకరత్న దాసరి నారాయణరావు. ప్రేమ.. పెళ్లి.. సమాజం.. రాజకీయం.. విప్లవం.. ప్రశ్న.. జవాబు ఇలా అన్ని అంశాల్ని ప్రేక్షకుల గుండెలోతుల్లోకి తీసుకెళ్ళి తన సత్తా చూపించారు దాసరి. పెద్ద హీరోలతోనే కాదు చిన్న సినిమాలు కూడా తీసి నిర్మాతలకి అండగా నిలిచిన ఘనత దాసరిది. ఆయన లేని లోటు ఎవరు భర్తీ చేయలేనిది. దాసరి జయంతిని డైరెక్టర్స్ డేగా జరుపుకుంటున్న మన దర్శకులు సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

# గవర్నర్ తమిళిసైతో కాంగ్రెస్ నేతల భేటీ

### రైతు సమస్యలు, ధాన్యం కొనుగోళ్లపై ఫిర్యాదు
### కరోనా టెస్టులు పెంచేలా ఆదేశించాలని ఉత్తమ్ వినతి

హైదరాబాద్,మే4(ఆర్‌ఎన్‌ఎ): గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌తో కాంగ్రెస్ నేతలు ఉత్తమ్ కుమార్ రెడ్డి, భట్టి విక్రమార్క, మర్రి శశిధర్ రెడ్డి భేటీ అయ్యారు. రైతుల సమస్యలు, ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ వైఫల్యంపై ఫిర్యాదు చేశారు. కరోనా టెస్టులు పెంచేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని గవర్నర్‌కు కాంగ్రెస్ నేతలు విజ్ఞప్తి చేశారు. సోమవారం రాజ్‌భవన్‌లో వీరంతా భేటీ అయ్యారు.

లాక్‌డౌన్‌లో రైతుల సమస్యలు, కరోనా నివారణ చర్యల్లో ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఉత్తమ్ కుమార్ గవర్నర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైఫల్యాలపై కాంగ్రెస్ నేతలుతో కలిసి గవర్నర్‌కు వినతి పత్రం అందజేశారు. అకాల వర్షం కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. అలాగే వలస కూలీల విషయంలో ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకునేలా ఆదేశించాలని లేఖలో పేర్కొన్నారు. లాక్‌డౌన్ కారణంగా ఉపాధి కోల్పోయిన ప్రజలను ఆదుకోవాలని లేఖ ద్వారా కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఆర్థికంగా చితికిపోయిన పేదలను ఆదుకోవాలని కోరింది. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, కరోనా వైరస్ నివారణ చర్యల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ప్రభుత్వం వైఫల్యానికి నిరసనగా మంగళవారం ఒక రోజు దీక్షలు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. పీసీసీ, డీసీసీ కార్యాలయాలు, స్థానిక సేకరణ కేంద్రాలు, పార్టీ నేతల ఇళ్లలో ఈ దక్షలు చేపట్టాలని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి కోవిడ్ టాస్క్ ఫోర్స్ కమిటీ చైర్మన్, మాజీ మంత్రి ఎం. శశిధర్‌రెడ్డి సమన్వయ కర్తగా వ్యవహరిస్తారని ఆయన తెలిపారు.




హైదరాబాద్ ఉప్పల్ శివారులోని చెంగిచెర్లలో రక్తదాన శిబిరం ప్రారంభించిన మంత్రి మల్లారెడ్డి

## రక్తదాన శిబిరం ప్రారంభించిన మంత్రి మల్లారెడ్డి

హైదరాబాద్,మే4(ఆర్‌ఎన్‌ఎ): బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెంగిచెర్లలో రక్తదాన శిబిరాన్ని కార్మిక శాఖ మంత్రి మాల్లారెడ్డి ప్రారంభించారు. టీఆర్ఎస్ పార్టీ ద్విదశాబ్ది కార్యక్రమంలో భాగంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం హర్షణీయమని మంత్రి పేర్కొన్నారు. యువత రక్తదానం చేసేందుకు ముందుకొచ్చి ప్రాణదాతలుగా నిలువాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్ని దానాలలో కెల్లా రక్తదానం గొప్పదన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు.

## ప్రధాన నగరాల్లో లాక్‌డౌన్ అమలులో విఫలం

### అందుకే అక్కడ కేసులు ఎక్కువ: కేంద్రమంత్రి

హైదరాబాద్,మే4(ఆర్‌ఎన్‌ఎ): ఢిల్లీ, ముంబై మెట్రో నగరాల్లో ఉన్న ప్రజలు సరిగా లాక్‌డౌన్ ఆంక్షలను పాటించలేదని, అందుకే అక్కడ వైరస్ కేసులు పెరుగుతున్నట్లు కేంద్ర మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ తెలిపారు. దేశంలోని పట్టణాల్లోనే ఎక్కువ శాతం కరోనా పాజిటివ్ కేసులు నమోదు అవుతున్నట్లు ఆయన చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో కేసుల సంఖ్య అంతగా లేదని, పట్టణాల కంటే గ్రామీణ ప్రాంత ప్రజలే బాధ్యతతో వ్యవహరించారని ఆయన అన్నారు. దేశంలో నమోదు అయిన మొత్తం కేసుల్లో ముంబైలోనే 20 శాతం కేసులు ఉన్నాయి. ముంబైలో మొత్తం 8613 పాజిటివ్ కేసులు నమోదు కాదు, 343 మంది మరణించారు. ఢిల్లీలో 4549 కేసులు నమోదు అయ్యాయి. కొన్ని పెద్ద పెద్ద నగరాలకు విదేశాల నుంచి ప్రయాణికులు రావడం వల్ల కూడా వైరస్ కేసులు ఎక్కువైనట్లు తెలిపారు. ఇక నగరాల్లో ఉన్న మురికివాడల్లో సోషల్ డిస్టాన్సింగ్, లాక్‌డౌన్ ఆంక్షలను అమలు చేయడం కష్టం అవుతుందన్నారు.

## కవిత చొరవతో స్వస్థలాలకు యువత

నిజామాబాద్, మే 4: మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత ప్రత్యేక చొరవతో తెలంగాణకు చెందిన కొందరు యువతీ, యువకులు మహారాష్ట్ర నుంచి స్వస్థలాలకు చేరుకున్నారు. మహారాష్ట్రలోని అమరావతి నుంచి నిజామాబాద్, జగిత్యాల, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన 25 మంది యువతులు, ఐదుగురు యువకులు సోమవారం వారి స్వస్థలాలకు చేరుకున్నారు. వారంతా శిక్షణ నిమిత్తం కొన్ని నెలల క్రితం మహారాష్ట్రలోని అమరావతికి వెళ్లారు. అయితే ఇంతలో లాక్డౌన్ అమల్లోకి రావడంతో వారు అక్కడే చిక్కుకుపోయారు. రోజులు గడుస్తున్నా కొద్ది వారి గురించి తల్లిదండ్రులు ఆందోళన చెందుతుండటంతో తెలంగాణకు రావడానికి సాయం చేయాలని మాజీ ఎంపీ కవితను కోరారు. వారి అభ్యర్థనపై వెంటనే స్పందించిన కవిత 30 మందికి బస్సు ఏర్పాటు చేసి, భోజన సదుపాయం కల్పించారు. శనివారం బయలురేరిన వారంతా సోమవారం ఉదయానికి స్వస్థలాలకు చేరుకున్నారు. అనంతరం వారు హోమ్ క్వారంటైన్లో ఉండేలా అధికారులు చర్యలు చేపట్టారు. కాగా, తమకు సాయపడ్డ కవితకు యువతీ యువకులు, వారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## పోలీసులపై వలస కార్మికుల దాడి.. టియర్ గ్యాస్ ప్రయోగం

సూరత్, మే 4: గుజరాత్‌లోని సూరత్‌లో వలస కార్మికులు అత్యుత్సాహం ప్రదర్శించారు. తమను సొంతూర్లకు పంపించాలని వలస కార్మికులు డిమాండ్ చేస్తూ.. పోలీసులపై దాడులకు పాల్పడ్డారు. డైమండ్, టెక్స్‌టైల్స్ పరిశ్రమల్లో పని చేసే వలస కార్మికులు ఈ ఆందోళనకు దిగారు. పోలీసులపై కార్మికులు దాడి చేయడం ఇది నాలుగోసారి.

తాజాగా సూరత్ శివార్లలోని వరేలి ఏరియాలో కార్మికులు ఆందోళనకు దిగి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులపై ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. ఈ క్రమంలో ఆందోళనకారులను నిలువరించేందుకు వారిపై పోలీసులు టియర్‌గ్యాస్ ప్రయోగించారు. ఆందోళనకారుల నిరసనల నేపథ్యంలో అక్కడ కేంద్ర బలగాలను మోహరించారు. సూరత్‌లోని పాలన్‌పూర్ పాటియా ఏరియాలోనూ వలస కార్మికులు ఆందోళనకు దిగారు.

ఏప్రిల్ 10వ తేదీన వలస కార్మికులు సూరత్ రోడ్లపైకి వచ్చిన నిరసన చేపట్టిన విషయం విదితమే. పలు వాహనాలకు నిప్పుపెట్టారు. లాక్‌డౌన్ వల్ల తాము బతకడం కష్టమైందని సొంతూర్లకు పంపించాలని కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఇది ఒక ఉదాహరణ మాత్రమే...

నేటినిజం
మంగళవారం 5-5-2020

ఈశాన్య ప్రాంతంలోని కొందరు సామాజిక ఉద్యమకారులు 'వెదురు' ఈనెలతో రకరకాల పరిణామాలలో సంచులను తయారుచేస్తున్నారట! వెదురు కలపను ఉపయోగించి 'సీసా'లను, గిన్నెలను, దొన్నెలను, డిప్పలను, చిప్పలను, డబ్బాలను, 'డొక్కు', చిన్న డబ్బాలను కూడ తయారుచేసే 'పంపిణీ సంస్థలు' పెరుగుతున్నాయట! ఈ 'చిట్టి' సంస్థలలో అత్యధికం స్వచ్ఛందంగా 'స్వచ్ఛారత' పునర్ నిర్మాణ కార్యక్రమంలో పాల్గొంటున్నాయి. కొన్ని 'సంస్థలు' తాము తయారుచేసిన ఈ 'వంశీ'- వెదురు- ఉపకరణాలను ఉచితంగా పంపిణీ చేయాలి! మరికొన్ని సంస్థలు 'లాభ నష్ట రహిత ప్రాతిపదికపై' ఈ వెదురు సంచులను బుట్టలను తట్టలను 'సీసా'లను చౌక ధరలకు విక్రయిస్తున్నాయట! మంచినీరు సరఫరా చేయడంకోసం ఇలా తయారైన 'అర్థ లీటర్', 'లీటర్', 'రెండు లీటర్ల', 'పావు లీటర్' పరిమాణంలోని వెదురు సీసాలను నవంబర్‌లో స్వచ్ఛంద కార్యకర్తలు గౌహతిలో ప్రదర్శించడం మాధ్యమాలలో ప్రచారమైంది. 'ప్లాస్టిక్' ఉపకరణాలకు ప్రత్యామ్నాయంగా ఈ 'వెదురు'వస్తువులను విరివిగా వాడాలన్నది ఈ 'స్వచ్ఛంద' సేవకులు చేస్తున్న ప్రచారం! ఇది ఒక ఉదాహరణ మాత్రమే...అన్ని ప్రాంతాలలోను 'ప్లాస్టిక్'కు ప్రత్యామ్నాయాలను తయారుచేస్తున్న 'స్వచ్ఛ భారత' పర్యావరణ ప్రేమికుల సంఖ్య విస్తరిస్తోంది! గత ఏడాది అక్టోబర్ రెండవ తేదీన- మహాత్మాగాంధీకి నూటయాబయి ఏళ్లు నిండి నూట యాబయి ఒకటవ జగన్తిని జరుపుకున్న సందర్భంగా- 'ఏక పర్యాయ వినియోగ' 'ప్లాస్టిక్' పదార్థాల నిషేధం దేశమంతటా అమలులోకి వచ్చింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా ఈ 'ఏక పర్యాయ వినియోగ'- సింగిల్ యూజ్- 'ప్లాస్టిక్' వస్తువుల నిషేధాన్ని ఆవిష్కరించాడు. గతంలోవలె కాక 'ప్రస్తుత నిషేధం' మెల్లమెల్లగా విజయవంతం అవుతుండడం ప్రకృతికి ప్రమోదం కలిగిస్తున్న శుభ పరిణామం! 'ప్లాస్టిక్' దశాబ్దులపాటు కలిగించిన గాయాలతో నొప్పిని భరించలేక విలపిస్తున్న ప్రకృతి నొప్పిని కలిగిస్తోంది! అందువల్ల "గాయాలను మాన్పడానికి వీలుగా" పత్తి, నూలు, జనుపనార, కాగితం, వెదురు, కలప ఉపకరణాలు మళ్లీ జీవం పోసుకుంటున్నాయి. భాగ్యనగరంలోను తెలుగు ప్రాంతాలలోని వివిధ పట్టణాలలోను కొన్ని జాతీయభావ స్వచ్ఛంద సంస్థలు విరివిగా బట్ట సంచులను పంపిణీ చేయడం ప్రకృతి గాయాలకు చికిత్స జరుగుతోందనడానికి నిదర్శనం! సికిందరాబాద్‌లోని 'సైనిక్‌పురి' నివాసులు 'ప్లాస్టిక్' నిర్మూలనకోసం దేవాలయాలు మాధ్యమంగా ఉద్యమిస్తున్నారట! పురోహితులు, అర్చకులు, స్థానిక సంక్షేమ సంఘాలవారు కలసి కట్టుగా భక్తులకు, దేవాలయ సందర్శకులకు 'ప్లాస్టిక్' బుట్టలను, తట్టలను, సీసాలను, సంచులను వినియోగించవద్దని విజ్ఞప్తులను చేస్తున్నారట! పూజా సామగ్రిని తీసుకొని వెళ్లడానికి 'ప్రత్యామ్నాయ' ఉపకరణాలను వాడాలన్నది ఈ దేవాలయ ఉద్యమ స్ఫూర్తి...

## క్యాన్సర్ పేషెంట్‌కు కరోనా

### -మరోమారు ఉలిక్కిపడ్డ ఉమ్మడి కరీంనగర్ జిల్లా

కరీంనగర్,మే4(నేటినిజం ప్రతినిధి): ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కరోనా కట్టడి జరిగినా మరోమారు కలకలం తప్పలేదు. జగిత్యాల జిల్లాకు చెందిన వ్యక్తికి కొత్తగా కరోనా పాజిటివ్ రావడంతో మరోసారి కరీంనగర్‌లో టెన్షన్ వాతావరణం నెలకొంది. ఆ వ్యక్తి కొద్దిరోజుల పాటు కరీంనగర్ సమీపంలోని బొమ్మకల్ చల్మెడ మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో క్యాన్సర్ ట్రీట్మెంట్ తీసుకున్నారు. అతనికి ట్రీట్‌మెంట్ ఇచ్చిన వైద్యులు, కలిసిన ఆస్పత్రి సిబ్బంది, బంధువుల వివరాలను పోలీసులు ఆరా తీస్తున్నారు. పేషెంట్ బంధువు కరీంనగర్‌లో ఉన్నట్లు గుర్తించిన అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. కరోనా పాజిటివ్ పేషెంట్‌తో ప్రైమరీ కాంటాక్ట్ ఉన్న అందరిని క్వారంటైన్ పంపించే అవకాశం ఉంది. దేశంలోనే ఒకేసారి పది కరోనా పాజిటివ్ కేసులు నమోదైన జిల్లాగా.. తొలిసారి రెడ్‌జోన్ ప్రకటించిన ప్రాంతంగా కరీంనగర్ అంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. అయితే అధికారులు, ప్రజాప్రతినిధులు తీసుకున్న కఠిన నిర్ణయాలతో కరోనాను కట్టడి చేయగలిగారు. అయితే ఇప్పుడు మరోసారి కరోనా పాజిటివ్ రావడంతో స్థానికుల్లో భయాందోళనలు నెలకొన్నాయి.

## కూతురు పంపే విషయంలో ఘర్షణ

### -వియ్యంకుడిని కర్రతో మోదడంతో మృతి

నిజామాబాద్,మే4(ఆర్ఎన్ఎ): కూతురిని పుట్టింటికి పంపించనందుకు వియ్యంకుడిని కర్రతో కొట్టి హత్య చేసాడో వ్యక్తి. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ మహ్మద్ ఆసిఫ్ తెలిపిన వివరాల ప్రకారం... జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం దూంపేటకు చెందిన బోదాసు రాజెం కమ్మర్‌పల్లి హాసాకొత్తూర్‌లోని మారుతినగర్‌లో నివాసముండే తన కూతురు ఇరుగదిండ్ల నీలా ఇంటికి శనివారం వెళ్లాడు. తన కూతురిని పుట్టింటికి తీసుకెళ్తానని వియ్యంకుడు ఇరగదిండ్ల రాములు(45), వియ్యంకురాలు రేణుకను కోరాడు. కొడుకు ఇంట్లో లేడని, వచ్చిన తర్వాత తీసుకెళ్లాలని చెప్పారు. దీంతో కోపోద్రిక్తుడైన బోదాదు రాజెం వారిని బెదిరిస్తూ కూతురుని తీసుకెళ్లే ప్రయత్నం చేశాడు. రాములు అతని భార్య అడ్డు చెప్పగా గొడవ ప్రారంభమైంది. ఈ క్రమంలో రాజెం అక్కడే ఉన్న కర్రతో రాములును మోదాడు. తలకు బలమైన గాయం కావడంతో కింద పడిపోయాడు. కొడుకు మిరేష్ ఘటనా స్థలానికి చేరుకొని తండ్రిని నిజామాబాద్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాములు మరణించాడు. మిరేష్ ఫిర్యాదు మేరకు బోదాసు రాజెంపై హత్య నేరం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ ఘటన కుటుంబంలో కల్లోలం రేపింది. ఇరు కుటుంబాల మధ్య చిచ్చు పెట్టింది.

## వలసకూలీల బస్సుకు ప్రమాదం

### -అదుపుతప్పి చెట్టును ఢీకొన్న బస్సు

నిజామాబాద్,మే4(ఆర్ఎన్ఎ): రాజధాని హైదరాబాద్ నుంచి రాజస్థాన్ వెళున్న వలస కూలీలు పెను ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం బుస్సాపూర్ జాతీయ రహదారి 44 వద్ద వారు ప్రయాణిస్తున్న ప్రైవేటు బస్సు సోమవారం తెల్లవారుజామున అదుపుతప్పింది. దీంతో రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్‌కు గాయాలవగా, ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఎమ్మార్వో ఇలియాస్ అహ్మద్ వారికి స్థానిక పాఠశాలలో ఆశ్రయం కల్పించి, అల్పాహారం అందించారు. అధికారులు ప్రత్యామ్నాయంగా మరో బస్సును ఏర్పాటు చేసి కూలీలను తరలించారు. లాక్‌డౌన్‌తో చిక్కుకుపోయిన వలస కూలీలు వారి స్వస్థలాలకు వెల్లడానికి ప్రభుత్వం అనుమతివ్వడంతో సొంత రాష్ట్రాలకు బయల్దేరుతున్నారు కూలీలు. కొందరు రైళ్లలో వెళ్తుండగా, మరికొందరు ప్రైవేట్ వాహనాల్లో తరలి వెళ్తున్నారు.

## మద్దతు భారత ఆర్థిక వ్యవస్థ పటిష్టానికి మంచి అవకాశం- డాక్టర్ జితేంద్ర సింగ్

హైదరాబాద్, మే 4:కేంద్ర సహాయ మంత్రి (ఇండిపెండెంట్ ఛార్జ్) (ఈశాన్య భారత రీజియన్ అభివృద్ధి, పర్సనల్, పబ్లిక్ గ్రీవియన్స్ పెన్షన్స్ పి.ఎం.ఓ. సహాయ మంత్రి, అణుశక్తి మరియు అంతరిక్ష శాఖ,) డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ కోవిడ్ అనంతర పరిస్థితుల్లో భారత ఆర్థిక వ్యవస్థకు వెదురు పంట దన్నుగా నిలుస్తుందని, వెదురు వనరుల ద్వారా భారత్ ఆర్థిక శక్తిగా ఎదిగేందుకు అవకాశం ఉందని తెలిపారు.బ్యాంబూ కాన్ క్లేవ్ ను ఉద్దేశించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన ప్రసంగించారు. ఈ కాన్ఫరెన్స్ లో ఈశాన్య భారత రీజియన్ అభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రతినిధులు, కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ మరియు వివిధ రంగాలకు చెందిన వాటాదాలు పాల్గొన్నారు. డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, వెదురు నిల్వల్లో 60 శాతం ఈశాన్య భారత దేశంలోనే ఉందని, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో, గత ఆరేళ్ళుగా ఈశాన్య భారత అభివృద్ధికి ప్రాధాన్యత నిచ్చి, గొప్ప ప్రయోజనాలు చేకూర్చారని, అదే సమయంలో వెదురు రంగానికి కూడా ప్రోత్సాహం అందిందని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఈశాన్య భారతానికి ఇంత ప్రోత్సాహం లభించలేదని, ఈ విషయంలో మోడీ ప్రభుత్వం 2017లో తీసుకొచ్చిన 100 సంవత్సరాల నాటి భారతీయ అటవీ చట్టంలోని సవరణలను ప్రస్తావించిన ఆయన, దాని ఫలితంగా వెదురు జీవనోపాధి అవకాశాలను పెంచడంలో భాగంగా ఇంట్లో పెరిగిన వెదురుకు మినహాయింపు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. వెదురుకు ప్రచారం చేయడాన్ని మోడీ ప్రభుత్వం ప్రాధాన్యత కల అంశంగా భావిస్తోందని, లాక్ డౌన్ వ్యవధిలో కూడా, ఏప్రిల్ 16న హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, వివిధ రంగాల్లో పరిమిత కార్యకలాపాలను అనుమతించే సమయంలో కూడా ఇది స్పష్టంగా తెలుస్తుందని డాక్టర్. జితేంద్ర సింగ్ తెలిపారు. నాటడం, ఇతర ప్రక్రియలు సహా వెదురుకు సంబంధించిన కార్యకలాపాల పనితీరుకు ఇందులో అనుమతి లభించిందని తెలిపారు.భారతదేశంలో అగర్ బత్తీ కోసం 2,30,000 యూనిట్ల వెదురు అవసరం అవుతుందని, దాని మార్కెట్ విలువ 5000 కోట్ల రూపాయలు ఉంటుందని, దానిలో పెద్ద మొత్తాన్ని చైనా, వియత్నాం లాంటి దేశాల నుంచి దిగుమతి చేసుకోవడం ఆశ్చర్యకరమైన అంశమని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. కోవిడ్ తదనంతర పరిస్థితుల నేపథ్యంలో, భారతదేశ పోటీ ప్రపంచంలో ఎదగడానికి, మరియు స్వయం సమృద్ధిని సాధించడానికి ఈశాన్య ప్రాంతానికి ఇదో చక్కని వకాశమని ఆయన తెలిపారు.సమీప భవిష్యత్తులో, ఈశాన్య మంత్రిత్వ శాఖ వెదురు తయారీ మరియు వాణిజ్యాన్ని ప్రోత్సహించడాన్ని మరింత వేగవంతం చేసేందుకు ప్రణాళికలను రూపొందించే ప్రయత్నం చేస్తోందని, ఈ రంగంలో పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్ (పి.పి.పి)సాధ్యతను కూడా పరిశీలిస్తోందని డాక్టర్. జితేంద్ర సింగ్ తెలిపారు. వెదురు నుంచి బయో డీజిల్, గ్రీన్ ఫ్యూయల్ మరియు చెక్క కలప, ప్లైవుడ్ సహా పలు ఉత్పత్తుల్లో ప్రాసెస్ చేయవచ్చని, ఇది ఆర్థిక వ్యవస్థ ముఖచిత్రాన్ని మార్చడమే కాకుండా బహుళ రంగాల్లో ఉపాధి అవకాశాలను సృష్టించడమే గాక, మరింత మెరుగు పరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో మాట్లాడిన వారిలో ఈశాన్యభారత అభివృద్ధి ప్రత్యేక కార్యదర్శి శ్రీ ఇందోవర్ పాండే, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి శ్రీ అల్కా భార్గవ్, ఈశాన్యభారత అభివృద్ధి సంయుక్త కార్యదర్శి రాం వీర్ సింగ్, సి.బి.టిసి, ఎం.డి మరియు ఈశాన్య హస్తకళలు మరియు చేనేత అభివృద్ధి కార్పొరేషన్ (ఎన్.ఈ.హెచ్.డి.సి) శ్రీ శైలేందర్ చౌదరి, మాజీ మంత్రి జాతీయ వెదురు మిషన్ సభ్యుడు శ్రీ అన్నా సాహెబ్ ఎం.కె. పాటిల్ ఉన్నారు. ఈ కాన్ క్లేవ్ ను ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ గ్రీన్ ఎనర్జీ (ఐ.ఎఫ్.జి.ఈ) డైరక్టర్ జనరల్ శ్రీ సంజయ్ గంజూ పర్యవేక్షించారు.

# ప్రజలను వెన్నాడుతున్న భయాలు

హైదరాబాద్, మే 4:లాక్‌డౌన్ మరో రెండు వారాలు పొడిగిస్తూ హోంశాఖ ఉత్తర్వులు ఇచ్చాక ప్రధాని మోదీ జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తారని ప్రచారం జరిగింది. ప్రజలంతా ఏమి చెబుతారో అని ఆశగా చూశారు. కానీ ప్రధాని ఎలాంటి సందేశం ఇవ్వలేదు. సరికదా అనేక సందేహాలు ప్రజలను గందరగోళంలోకి నెడుతున్నాయి. ప్రజలంతా ఇప్పటివరకు ప్రభుత్వాలు చెప్పినట్లుగా లాక్‌డౌన్ పాటిస్తూ ఇంటికి పరిమితం అయ్యారు. జన్‌ధన్ ఖాతాలు లేకున్నా, ప్రభుత్వాలు సాయం చేయకున్నా బిక్కుబిక్కుమంటూ మధ్య తరగతి, ఇతర తరగతుల వారు భవిష్యత్‌పై బెంగతో కూర్చున్నారు. తమకు ఎలాంటి సాయం అందుతుందో అన్న ఆశతో ఉన్నారు. ఈ తరతగతులకు ఎలాంటి ఊరడింపు వస్తుందో అని ఎదురుచూశారు. వివిధ వర్గాలు, రంగాల ప్రముఖులు, ఆర్థికరంగ నిపుణులతో ప్రధాని చర్చిస్తున్నారు. ఈ దశలో లాక్‌డౌన్ మరో రెండు వారాలు పొడిగిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. ప్రధాని మళ్లీ ప్రకటన ద్వారా ఊరడింపు పలుకులు చెబుతారనుకున్న వారికి నిరాశే ఎదురయ్యింది. దాదాపు రెండు నెలల పాటు లాక్‌డౌన్ కారణంగా వస్తూత్పత్తి పోయింది. ఉద్యోగాలు పోయిన వారు కొందరు..ఉద్యోగాలు లేని వారు మరికొందరు..ఉద్యోగాలు లేక స్వయం ఉపాధితో పొట్టపోసుకునే వారు కొందరు.. ఇలా వివిధ రంగాల వారు ఉన్నారు. వారంతా తమ భవిష్యత్‌పై ఆశలు చచ్చి బతుకుతున్నారు. వీరందరిని ఎలా ఆదుకోబోతున్నారో కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు ఎలాంటి హామీ ఇవ్వడం లేదు. లాక్‌డౌన్ ఎంతకాలం ఉంటుందో తెలియదు. ఎలా ముందుకు తీసుకుని వెళతారో తెలియదు. గత నెలాఖరున అమల్లోకి తెచ్చిన లాక్‌డౌన్ గడువు ముగిసే తరుణంలో ప్రధాని నరేంద్ర మోదీ జాతినుద్దేశించి ప్రసంగించి దాన్ని వచ్చే నెల 3 వరకూ పొడిగిస్తున్నట్టు ప్రకటించారు. ఈ క్లిష్ట సమయంలో దేశ ప్రజానీకమంతా పాటించాల్సిన ఏడు అంశాలను కూడా ఆయన ప్రస్తావించారు. కరోనా మహమ్మారి తీవ్రత ఆశించిన స్థాయిలో తగ్గిన దాఖలా లేకపోవడంతో లాక్‌డౌన్ పొడిగింపే ఉత్తమమని ప్రకటించారు. దాదాపు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులూ ప్రధానితో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఇదే అభిప్రాయం వెల్లడించారు. అదే సమయంలో వ్యవసాయం, ఆక్వా, ఉద్యానపంటల దిగుబడుల రవాణా, వాటి మార్కెటింగ్, పారిశ్రామికరంగం తదితరాలను కూడా దృష్టిలో పెట్టు కోవాలని సూచించారు. చాలా దేశాలతో పోలిస్తే మన దేశంలో లాక్‌డౌన్ అమలు తీరు ఎంతో మెరుగ్గా ఉందని ప్రధాని మోదీ చెప్పిన మాటల్లో వాస్తవముంది. అయితే ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా కరోనా ఆశించినంతగా తగ్గటం లేదు. దీన్ని కట్టడి చేయడం సామాన్యమైన విషయం కాదని, ఇప్పటికిప్పుడు ఇది కంట్రోల్ కాదని అంటున్నారు. పాజిటివ్ కేసుల సంఖ్య అంతకంతకు పెరుగుతోంది. ఆందోళనకర స్థాయికి చేరుతోందని గణాంకాలు గమనిస్తే తెలుస్తుంది. వైద్యులు, ఇతర సిబ్బంది అలుపెరగని రీతిలో శ్రమిస్తున్నారు. ఆ మహమ్మారిని అదుపు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. వనరుల కొరత ఎంతగా వేధిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వాలన్నీ కరోనా వ్యాధి పైనే తమ సర్వశక్తులూ కేంద్రీకరించి, దాని కట్టడికి అధిక ప్రాధాన్యమిచ్చి పనిచేస్తున్నాయి. దీన్ని మరింత కాలం ఇదే స్థాయిలో కొనసాగిస్తే తప్ప నిరోధించడం అసాధ్యమని గమనించి మరో రెండువారాలు పొడిగించారు. అయితే ఇక్కడ ఓ విషయం గమనించాలి. కరోనా మూలాలు ఎక్కడెక్కడ ఉన్నాయో ఇంకా గుర్తించడం కష్టంగా మారింది. టెస్ట్ కిట్లు అందుబాటులో లేకపోవడం వల్ల టెస్ట్ చేయడం సాధ్యం కావడం లేదు. కరోనా కట్టడి వ్యూహంలో అదే పెద్ద సమస్యగా మారింది. మొత్తంగా ఇప్పుడు లాక్‌డౌన్ పొడిగిస్తూ పోవడం వల్ల సాగురంగం సంక్షోభంలో పడటం, వ్లలెనీమల్లో ఉపాధి లేకపోవడం పర్యవసానంగా అనేకులు పనిచేసేందుకు నగరాలను, పట్టణాలను ఆశ్రయిస్తూ వచ్చారు. వీరంతా ఇప్పుడు రోడ్డున పడ్డారు. ఆయా రంగాల్లో రిజిస్టరయిన కార్మికుల సంఖ్య అన్ని రాష్ట్రాల్లోనూ తక్కువే వుంది. ఇతర అసంఘటిత రంగాల్లోనూ ఇదే స్థితి నెలకొంది. ఈ దశలో నగరాల్లో ఇంతకాలం పొట్టపోసుకున్న లక్షలాది మంది తమకు ఆకలిచావులు తప్పవన్న భయాందోళనలతో స్వస్థలాలకు నడుచు కుంటూ వెళ్లారు. వారిని తరలించే ప్రయత్నాలకు కేంద్రం అనుమతించింది. అయితే వీరంతా సొంతూళ్లకు వెళ్లినా అక్కడా వారికి ఎలాంటి ఉపాధి కల్పించబోతున్నారో చెప్పడం లేదు. ఉద్యోగాలు కోల్పోయి, ఉపాధి దక్కక రోడ్డున పడ్డవారిని ఎలా అక్కున చేర్చుకుంటారో తెలియడం లేదు. ఆర్థికరంగ నిపుణులతో జరిగిన చర్చల తరవాత ప్రధాని మోదీ ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో తెలియడం లేదు. ఇప్పుడు ప్రభుత్వాలన్నీ ప్రధానంగా కరోనా బారిన పడ్డ ప్రజల ఆరోగ్య పరిరక్షణపైనే దృష్టి కేంద్రీకరించి వున్నాయి. లాక్‌డౌన్‌తో ఉపాధి కోల్పోయిన వారి కోసం చర్యలు తీసుకుంటున్నా అవి ఎక్కడా సరిపోవడం లేదు. దశాబ్దాలుగా అసంఘటిత రంగ కార్మికుల స్థితిగతులెలా వున్నాయో, వారిలో అందరూ నమోదవుతున్నారో లేదో ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం వల్ల హఠాత్తుగా వచ్చిపడిన ఈ సంక్షోభంలో అందరికీ సాయం అందించడం సమస్యగా మారింది. లాక్ డౌన్ మున్ముందు మరింత కఠినం అయితే ప్రజలు తట్టుకోగలరా ఆలోచించాలి. ప్రజలు చావుకైతెన తెగిస్తారు కానీ.. బతకడం భారం అయితే తట్టుకోలేరు. ఆకలిచావులు లేకుండా చేయాల్సి ఉంది. ఆహార పదార్థాల సరఫరాకు ఆటంకం లేకుండా చూడటం, ఇతరత్రా అవసరాల కోసం నిరుపేద వర్గాలకు నగదు బదిలీ చేయడం వంటివి ఎంత అవసరమో... వివిధ వర్గాలకు ఎలాంటి సాయం అందించబోతున్నారో స్పష్టత రావాల్సి ఉంది. అందువల్ల ప్రజల్లో మరింత గందరగోళం చెలరేగకుండా ఆయా వర్గాలకు ఊరటనిచ్చే పతకాలు సాగాలి. ప్రణాళికలు చేయాలి. ఆదుకునే చర్యలు ఉండాలి. అప్పుడే ప్రజలకు స్వాంతన చేకూరుతుంది.

# ఏడాది చివరికల్లా కరోనా వ్యాక్సిన్

### చురుకుగా సాగుతున్న పరిశోధనలు
### అమెరికానే ముందు తెస్తుందన్న ట్రంప్
### వూహాన్‌పై ఆధారాలున్నాని అమెరికా పునరుద్ఘాటన

వాషింగ్టన్,మే4(ఆర్ఎన్ఎ): ఈ ఏడాది చివరి కల్లా కచ్చితంగా కరోనా వైరస్‌కు వ్యాక్సిన్ వస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ధీమా వ్యక్తం చేశారు. 2021 సంవత్సరం రాక ముందే అమెరికాకు వ్యాక్సిన్ అందుబాటులోకి వస్తుందన్నారు. వ్యాక్సిన్ వస్తుందన్న అంశంలో నమ్మకంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు చురుకుగా పరిశోధనలు సాగుతున్నాయని అన్నారు. లింకన్ మెమోరియల్ వద్ద ఫాక్స్ న్యూస్‌తో మాట్లాడుతూ ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా కరోనా వైరస్‌కు వ్యాక్సిన్ తయారీలో సైంటిస్టులు నిమగ్నమై ఉన్నారు. అయితే ఆ వ్యాక్సిన్లు మాత్రం 2012 మధ్య కాలంలో అందరికీ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నది. డాక్టర్ల లెక్క ప్రకారం వ్యాక్సిన్ తొందర్లోనే వస్తుందని ట్రంప్ స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా స్కూళ్లను, యూనివర్సిటీలను సెప్టెంబర్‌లో తెరవాలని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను కోరనున్నట్లు ట్రంప్ తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థ వీలైనంత త్వరగా మళ్లీ గాడిలోపడే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జనవరి 23వ తేదీన తనకు తొలిసారి నోవెల్ కరోనా వైరస్ గురించి అధికారులు తెలియజేసినట్లు ట్రంప్ చెప్పారు. ఇక కరోనా వైరస్ వచ్చింది వుహాన్‌లోని వైరాలజీ ల్యాబ్ నుంచే అని మరోసారి అమెరికా విదేశాంగ మంత్రి మైక్ పాంపియో ఆరోపించారు. గతంలో అధ్యక్షుడు ట్రంప్ చెప్పినట్లుగానే .. మళ్లీ పాంపియో ఈ వ్యాఖ్యలు చేశారు. కానీ నిపుణులు మాత్రం ల్యాబ్‌తో వైరస్‌కు సంబంధం లేదన్న వాదాన్ని వినిపిస్తున్నారు. వుహాన్ ల్యాబ్ నుంచే కరోనా వ్యాప్తి చైనా లోని వుహాన్ ల్యాబ్ లో కరోనా వైరస్ పురుడు పోసుకుందని అమెరికా మరోసారి ఆరోపించింది. ఐతే ఈ సారి మాత్రం ఈ ఆరోపణలకు పక్కా సాక్ష్యాలు ఉన్నాయని తెలిపింది. అమెరికా విదేశాంగ మంత్రి మైక్ పాంపియో మాట్లాడుతూ కావాలనే చైనా కరోనా వైరస్‌ను ల్యాబ్ నుంచే విడుదల చేసిందని చెప్పారు. చైనా కుట్రను త్వరలోనే ప్రపంచం ముందు ఉంచుతామని ఆయన అన్నారు. కరోనా ప్రపంచ వ్యాప్తంగా విస్తరించటానికి చైనాయే కారణమంటూ ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ పలుమార్లు కరోనా వైరస్ పుట్టుక వుహాన్ ల్యాబ్ లోనే జరిగిందంటూ ఆరోపిస్తున్నారు. దీనిపై అమెరికా విచారణను కూడా చేపట్టింది. నిజాలు వెల్లడించాలని అల్టిమేటం జారీచేసింది. ఈ నేపథ్యంలో కరోనా వుహాన్ ల్యాబ్ లోనే పుట్టిందంటూ ఆధారాలున్నాయని మైక్ పాంపియో చెప్పటంతో నిజంగానే అమెరికాకు ఏమైనా ఆధారాలు దొరికాయా అన్నది ఆసక్తిగా మారింది. వైరస్ కారణంగా జరిగిన నష్టాన్ని చైనా నుంచి కోరుతామని కూడా అమెరికా చెబుతోంది. అమెరికా మాదిరిగానే ఫ్రాన్స్‌కు చెందిన నోబెల్ బహుమతి గ్రహీత కరోనా వైరస్ వుహాన్ నుంచి బయటకు వచ్చిందని ఇదివరకే చెప్పారు. తాజాగా జపాన్‌కు చెందిన ఓ సైంటిస్టు కూడా ఇదే ఆరోపణ చేశారు. దీంతో అమెరికా చేస్తున్న ఆరోపణలకు బలం చేకూరినట్లవుతోంది. మొత్తంగా చైనా మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయా దేశాలు ఇప్పటికే హెచ్చరించాయి.

# తండ్రి చివరి చూపుకు నోచుకోని పిల్లలు

### ఆన్‌లైన్‌లో అంత్యక్రియలు చూస్తూ కన్నీరుమున్నీరు
### తల్లడిల్లేలా చేసిన న్యాయవాది మరణం

జగిత్యాల,మే4(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ కారణంగా చనిపోయిన వారిని చివరి చూపునకు కూడా నోచుకోకుండా చేస్తోంది. పిల్లల ఉన్నతిని కాంక్షిస్తూ వారిని విదేశాలకు పంపిస్తే.. అక్కడి నుంచే ఆన్‌లైన్లో అంత్యక్రియలను చూడాల్సి వస్తుందని వారు కలలో కూడా అనుకొని ఉండరు. ఈ హృదయవిదారకర సంఘటన జిల్లాలో చోటుచేసుకుంది. కరోనా వైరస్ నియంత్రణకు ప్రభుత్వం ప్రకటించిన లాక్‌డౌన్.. చివరకు కనిపెంచిన వారిని చివరి చూపునకు కూడా నోచుకోకుండా చేస్తోంది. తండ్రి చనిపోతే తలకొరివి పెట్టాల్సిన కొడుకులు రాలేని దుర్భర పరిస్థితి. చివరకు బంధువులు, స్నేహితులు స్వగ్రామంలో తండ్రి అంత్యక్రియలు నిర్వహిస్తుంటే, ఆన్‌లైన్‌లో చూసి దుఃఖాన్ని ఆపుకోలేకపోతున్నారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం రాఘవపట్నం గ్రామానికి చెందిన వూట్కూరి అశోక్‌రెడ్డి జగిత్యాల జిల్లాకేంద్రంలో సీనియర్ న్యాయవాదిగా పని చేస్తున్నాడు. ఈయనకు ఇద్దరు పిల్లలు. కూతురు అమెరికాలో ఉంటుండగా, కొడుకు న్యూజిలాండ్‌లో ఉంటున్నాడు. కొంతకాలంగా అనారోగ్యానికి గురైన అశోక్‌రెడ్డి ఆదివారం మృతిచెందాడు. కరోనా లాక్‌డౌన్‌తో అంతర్జాతీయ విమానాలు నడవకపోవడంతో, ఇతర దేశాల్లో ఉన్న కొడుకు, కూతురు రాలేక పోయారు. దీంతో ఆయా దేశాల్లో ఉన్న వారి పిల్లలు నాన్న అశోక్‌రెడ్డికి తలకొరివి పెట్టే పరిస్థితి లేక అక్కడే తండ్రిని తలుచుకొని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తండ్రి చివరి చూపునకు పిల్లలు నోచుకోలేక పోయారని ఆయన భార్య విలపించడం అంత్యక్రియలకు హాజరైనవారికి కన్నీళ్లు తెప్పించింది. చివరకు గత్యంతరం లేని పరిస్థితుల్లో వారి బంధువులతో తలకొరివి పెట్టించి అశోక్‌రెడ్డి అంత్యక్రియలు పూర్తి చేశారు. 5 ఏళ్లుగా సివిల్, క్రిమినల్ కేసులు వాదించిన ఆయన.. ఆ గ్రామానికి రెండుమార్లు సర్పంచ్‌గా సైతం పని చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పార్టీ పటిష్టతకు కృషి చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్, అశోక్‌రెడ్డి మృతిదేహంపై బీజేపీ జెండా కప్పి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు మోరపల్లి సత్యనారాయణరావు, గుజ్జుల రామకృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బాజోజి భాస్కర్, ఏసీఎస్ రాజు, ఇతర పార్టీల నాయకులు, జగిత్యాల బార్ అసోసియేషన్ న్యాయవాదులు అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించారు.

## లోక్‌పాల్ సభ్యుడు జస్టిస్ అజయ్ కుమార్ త్రిపాఠి కన్నుమూత కొవిడ్-19కు చికిత్స తీసుకుంటూ మరణం

హైదరాబాద్, మే 4: కరోనా వైరస్‌తో పోరాడుతూ, లోక్‌పాల్ న్యాయ సభ్యుడు జస్టిస్ అజయ్ కుమార్ త్రిపాఠి, ఢిల్లీ ఎయిమ్స్‌లో కన్నుమూశారు. మే 2, 2020 శనివారం రాత్రి 8.45 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచారు. కరోనా కారణంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తడంతో ఏప్రిల్ 2, 2020న ఢిల్లీ ఎయిమ్స్‌లో ఆయన్ను కుటుంబ సభ్యులు చేర్పించారు. చికిత్స తీసుకుంటూ ఆస్పత్రిలో జస్టిస్ త్రిపాఠి మరణించారు.జస్టిస్ అజయ్ కుమార్ త్రిపాఠి 1957 నవంబర్ 12న జన్మించారు. శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో ఆర్థిక శాస్త్రంలో (హానర్స్) డిగ్రీ పూర్తి చేశారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం క్యాంపస్ లా సెంటర్‌లో న్యాయవిద్య అభ్యసించారు. చదువు పూర్తయ్యాక పాట్నా హైకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారు. 2006 అక్టోబర్ 9న పాట్నా హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా జస్టిన్ త్రిపాఠి నియమితులయ్యారు. 2007 నవంబర్ 21న పూర్తిస్థాయి న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా 2018, జులై 7 నుంచి సేవలు అందించారు.2019 మార్చి 27న భారత లోక్‌పాల్ సభ్యుడిగా జస్టిస్ త్రిపాఠి ప్రమాణస్వీకారం చేశారు. లోక్‌పాల్ వ్యవస్థను నెలకొల్పడంలో, తన ఆలోచనలు, ప్రమేయంతో జస్టిస్ త్రిపాఠి ముఖ్య భూమిక పోషించారు. జస్టిస్ అజయ్ కుమార్ త్రిపాఠి మరణం పట్ల లోక్‌పాల్ కుటుంబం సంతాపం వ్యక్తం చేసింది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, జరిగిన నష్టం నుంచి కోలుకునేందుకు జస్టిస్ త్రిపాఠి కుటుంబ సభ్యులకు ధైర్యం అందించాలని దేవుడిని ప్రార్థించింది.

## ఏపిలో ఆగని కరోనా పంజా

### కొత్తగా మరో 67 కేసుల నమోదు
### మొత్తం కరోనా కేసుల సంఖ్య 1650కి చేరిక

విజయవాడ,మే4(ఆర్ఎన్ఎ): ఏపీపై కరోనా వైరస్ పంజా విసురుతోంది. గత వారం రోజులుగా రాష్ట్రంలో ప్రతిరోజూ 50కు పైగా కరోనా కేసులు నమోదవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా 67 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో రాష్ట్రంలో మొత్తం కరోనా కేసుల సంఖ్య 1650కి చేరింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ సోమవారం హెల్త్ బులిటెన్ విడుదల చేసింది. గడిచిన 24 గంటల్లో 10,292 శాంపిల్స్‌ను పరీక్షించగా 67 మందికి కరోనా నిర్ధారణ అయినట్టు తెలిపింది. ఇప్పటివరకు రాష్ట్రంలో కరోనా నుంచి 524 మంది కోలుకుని ఆస్పత్రుల నుంచి డిశ్చార్జి కాగా, 33 మంది మృతి చెందారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1093 మంది కరోనా బాధితులు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. గడిచిన 24 గంటల్లో గుంటూరు జిల్లాలో 19, చిత్తూరు జిల్లాలో 1, వైఎస్సార్ జిల్లాలో 4, కృష్ణా జిల్లాలో 12, కర్నూలు జిల్లాలో 25, విశాఖపట్నం జిల్లాలో 6 కరోనా కేసులు నమోదయ్యాయి. కేసుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండటంతో ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు గురవుతున్నారు. తాజాగా నమోదైన కేసుల్లో కర్నూలు జిల్లాలో అత్యధికంగా 25 కేసులు నమోదయ్యాయి. దీంతో జిల్లాలో కరోనా బాధితుల సంఖ్య 491కు చేరింది. గుంటూరులో 19 కేసులు నమోదు కాగా కృష్ణా జిల్లాలో 12 కేసులు నమోదయ్యాయి. గత కొన్ని రోజులుగా పెద్దగా కేసులు నమోదు కాని విశాఖ జిల్లాలో ఒక్కరోజే 6 కేసులు నమోదయ్యాయి. రాష్ట్రంలో కర్నూలు, గుంటూరు, కృష్ణా జిల్లాలలో కరోనా ప్రభావం ఏ మాత్రం తగ్గడం లేదు. మరోవైపు ప్రతిరోజూ అధిక సంఖ్యలో పరీక్షలు నిర్వహిస్తూ ఉండటంతో మరికొన్ని రోజుల్లో రాష్ట్రంలో కరోనా పూర్తిస్థాయిలో అదుపులోకి వస్తుందని అధికారులు భావిస్తున్నారు.

## కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన మంత్రి

సిద్ధిపేట,మే4(ఆర్ఎన్ఎ): జిల్లా కేంద్రమైన సిద్ధిపేటలో అర్హులైన లబ్ధిదారులకు మంత్రి హరీష్‌రావు కళ్యాణలక్ష్మీ చెక్కులను అందజేశారు. సోమవారం ఉదయం తన నివాసంలో చిన్నకోడూరు మండలానికి చెందిన పలు గ్రామాల్లోని 8 మంది అర్హులైన లబ్ధిదారులకు ఒక్కొక్కరికీ రూ.లక్షా 116 రూపాయల చొప్పున కళ్యాణ లక్ష్మీ చెక్కులను మంత్రి హరీష్‌రావు పంపిణీ చేశారు. పేదలకు అండగా సిఎం కెసిఆర్ కళ్యాణలక్ష్మిని ప్రవేశ పెట్టారని అన్నారు. పేదల పిల్లలకు పెళ్లిల్లు భారం కాకుండా చేశారని అన్నారు. కరోనా నేపథ్యంలో ప్రజలు సామాజిక దూరం పాటించాలని, మాస్కులు ధరించాలని మంత్రి సూచించారు.

## మద్యం ధరలను లెక్క చేయని ప్రజలు

### -బాటిల్ కోసం బారులు తీరిన మందుబాబులు

అమరావతి,మే4(ఆర్ఎన్ఎ): మందు బాబులకు ఏపి ప్రభుత్వం ధరల కిక్కిచ్చింది. సోమవారం నుంచి రాష్ట్రంలో వైన్ షాపులు తెరుచుకున్నాయి. ఉదయం నుంచే ప్రజలు మద్యం కోసం బారులు తీరారు. ఈ నేపథ్యంలో ఏపి ప్రభుత్వం కొత్త మద్యం ధరలను అమల్లోకి తీసుకొచ్చింది. రాష్ట్రంలో రీటెల్ ఎక్సైజ్ ట్యాక్స్ పేరిట మద్యం ధరలను భారీగా పెంచుతూ జగన్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్రం మార్గదర్శకాల ప్రకారం ఏపిలో మద్యం దుకాణాలు తెరుచుకున్నాయి. భౌతిక దూరం పాటించి మద్యం విక్రయించాలని ఏపి ప్రభుత్వం ఆదేశించింది. వైన్ షాపులను ఉదయం 11 గంటల నుంచి రాత్రి 7 గంటల

వరకు తెరవడంతో ఉదయం నుంచే షాపుల ముందు క్యూ కట్టారు. మద్యం విక్రయాలపై ఇప్పటికే అన్ని జిల్లాల కలెక్టర్లకు మార్గదర్శకాలు జారీ చేశారు. రూ.120 విలువైన మద్యం బ్రాండ్ ల క్వార్టర్ పై రూ.20, హాఫ్ బాటిల్ పైరూ.40, ఫుల్ బాటిల్ పై రూ.80 పెంచగా, రూ.120-150 విలువైన మద్యం బ్రాండ్ ల క్వార్టర్ పై రూ.40, హాఫ్ బాటిల్‌పై రూ.80, ఫుల్ బాటిల్‌పై రూ.120 పెంచారు. రూ.150 విలువైన మద్యం బ్రాండ్ ల క్వార్టర్ పై రూ.60, హాఫ్ బాటిల్‌పై రూ.120, ఫుల్ బాటిల్‌పై రూ.240 పెంచారు. ఇక, మినీ బీర్ పై రూ.20, ఫుల్ బీర్ పై రూ.30 పెంచారు.

## కోవిడ్ -19 మహమ్మారిపై పోరాడడంలో కరోనా వారియర్స్ తిరుగులేని పాత్ర, వారి త్యాగానికి కేంద్ర హోంమంత్రి వందనం

హైదరాబాద్, మే 4:కోవిడ్ -19 మహమ్మారిపై పోరాడడంలో కరోనా వారియర్స్, తిరుగులేని పాత్ర,వారి త్యాగానికి కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా ఈ రోజు వందనాలు అర్పించారు. ఇందుకు సంబంధించి అమిత్ షా ఒక ట్వీట్ చేస్తూ,"భారతదేశం తన వీరోచిత కరోనా యోధులకు నమస్కరిస్తోంది. శ్రీ నరేంద్ర మోడీ ప్రభుత్వం, దేశం మొత్తం మీ వెంట ఉన్నాయని నేను మీకు భరోసా ఇస్తున్నాను. సవాళ్లను అవకాశాలుగా మార్చడం ద్వారా మనం కరోనా నుండి దేశాన్ని విముక్తి చేయాలి. ఆరోగ్యకరమైన, సుసంపన్నమైన , బలమైన భారతదేశాన్ని సృష్టించడం ద్వారా ప్రపంచానికి ఒక ఉదాహరణగా నిలుద్దాం. జై హింద్! "



# ఉత్తమ్‌కుమార్‌రెడ్డివి మతిలేని మాటలు



సూర్యాపేట,మే 4: సూర్యాపేట జిల్లాకు భారీగా శానిటైజర్స్, మాస్క్‌లను ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు మంత్రి జగదీశ్ రెడ్డి సమక్షంలో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి కి మూడు వేల లీటర్ల శానిటైజర్స్, మూడు వేల మస్క్ లను అందజేశారు. తన తండ్రి నామా ముత్తయ్య ట్రస్ట్-మధుకాన్ షుగర్స్ ద్వారా అందజేసినట్లు ఎంపీ తెలిపారు. కరోనా నియంత్రణ కు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి కి తోడుగా స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావడం గొప్ప విషయమని విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ తీసుకున్న లాక్ డౌన్ నిర్ణయాలతో పాటు కరోనా కట్టడికి తీసుకుంటున్న చర్యల వల్లే తెలంగాణలో కరోనా అదుపులో ఉందని మంత్రి అన్నారు. ఎంపీ నామా కరోనా కట్టడికి చేస్తున్న కృషిని ప్రశంసించారు. అందరం కలిసి కట్టుగా పని చేస్తే కరోనా మహమ్మారిని పారద్రోలవచ్చున్నారు.కాంగ్రెస్ హయాం లో విత్తనాల కొనుగోలు దగ్గరి నుంచి పంటను అమ్ముకునే వరకు రైతులు పడిన ఇబ్బందులు వర్ణనాతీతం. రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసి వారం తిరుగక ముందే మద్దతు ధర చెల్లించిన చరిత్ర ప్రపంచం లో తెలంగాణ లో తప్పా మరెక్కడా లేదని మంత్రి జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. కరోనా టెస్టుల విషయంలో పీసీసీ చీఫ్ ఉత్తమ్ మతిలేని మాటలు మాట్లాడుతున్నాడన్నారు.రాష్ట్రంలోనే అత్యధిక పరీక్షలు చేసిన జిల్లాగా సూర్యాపేట నిలిచిందన్న విషయం మర్చిపోవద్దన్నారు. ఉత్తమ్ అండ్ కో ఉనికి కోసమే ఆరాటపడుతున్నారని తీవ్ర స్థాయి లో దుయ్యబట్టారు. కరోనా లక్షణాలు ఉన్న వ్యక్తుల సమాచారమిస్తే కచ్చితంగా పరీక్షలు జరుపుతామన్నారు. లాక్ డౌన్ ఎత్తివేసిన తర్వాత కూడా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకొని కరోనా కట్టడిలో భాగస్వామ్యం కావాలన్నారు.

# నిషేధిత పొగాకు ఉత్పత్తుల తయారు, విక్రయాలు జరుపుతున్న వ్యాపారి అరెస్ట్

కరీంనగర్,మే4(నేటినిజం ప్రతినిధి):కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో పొగాకు ఉత్పత్తులకు బానిసలుగా మారిన వ్యక్తుల బలహీనతలను ఆసరాగా చేసుకుని నిషేధిత గుట్కా, ఇతర పొగాకు ఉత్పత్తులను తయారు చేయడంతో పాటు విక్రయాలు జరుపుతున్న వ్యాపారిని కరీంనగర్ త్రీ టౌన్ పోలీసులు ఆదివారం నాడు అరెస్ట్ చేశారు. వివరాలు ఇలాఉన్నాయి.

జగిత్యాల జిల్లా కోరుట్ల లోనిరహమత్ పురా ప్రాంతానికి చెందిన యండి వసియోద్దీన్(39) నిషేధిత పొగాకు ఉత్పత్తులను తయారు చేయడంతో పాటు కరీంనగర్ ఉమ్మడి జిల్లా లోని వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నాడు. ఆదివారంనాడు కరీంనగర్ ఆర్టీసీ వర్క్‌షాప్ ప్రాంతంలో విక్రయాలు జరిపేందుకు వచ్చాడనే సమాచారంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి అదుపులోకి తీసుకున్నారు.విచారణలో తానే ఉత్పత్తులను తయారు చేస్తూ, విక్రయాలు జరుపుతున్నట్లు అంగీకరించాడు. అతడు అందించిన సమాచారం ప్రకారంగా కోరుట్లలోని ఉత్పత్తి కేంద్రం పై దాడి నిర్వహించడం తో పాటు 3.5లక్షల విలువైన వివిధ రకాల నిషేధిత పొగాకు ఉత్పత్తులు, యంత్రాలు, ముడి పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.

వెంటనే అతడిపై వివిధ సెక్షన్ల కింద త్రీ టౌన్ పోలీసులు కేసును నమోదుచేసి అరెస్ట్ చేసినట్లు త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ విజ్ఞాన్ రావు తెలిపారు. అతడికి ఎక్కడినుండి ముడి పదార్థాలు అందుతున్నాయనే విచారణ కొనసాగుతున్నది.ప్రస్తుతం లాక్ డౌన్ పరిస్థితుల్లో నిషేధిత పొగాకు ఉత్పత్తులకు డిమాండ్ ఎక్కువగా ఉండటంతో రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నట్లు అంగీకరించాడు.

నిషేధిత పొగాకు ఉత్పత్తుల విక్రయాలు, అక్రమ రవాణాకు పాల్పడే వారిపై ఉక్కుపాదంగుట్కా వ్యాపారం పై ఉక్కుపాదం మోపుతామని ఇప్పటికైనా, ఇలాంటి అక్రమ వ్యాపారాలను మానుకోవాలని, గుట్కా దందా నిర్వహిస్తున్న వారిపై అనుమానిత షీట్లు తెరుస్తామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ శ్రీ బి. విబి కమలాసన్ రెడ్డి హెచ్చరించారు.ఈ కేసులో ప్రధానపాత్ర పోషించిన పోలీసులను కమిషనర్ విబి కమలాసన్ రెడ్డి అభినందించారు.





## ఎంఫాన్' వస్తే సన్నద్ధంగా ఉండాలి: సీఎం జగన్

అమరావతి, మే 4: 'ఎంఫాన్' తుపాను ఆంధ్రప్రదేశ్ వైపు దూసుకొస్తే సన్నద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధికారులను ఆదేశించారు. తుపాను పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుపాను కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ వైపు భారీ తుపాను వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో సీఎం అధికారులతో సమీక్ష నిర్వహించారు. 'విద్యుత్, రెవెన్యూ, పౌరసరఫరాలు, వైద్యశాఖ సన్నద్ధంగా ఉండాలి. ఆస్తి, ప్రాణనష్టం లేకుండా చర్యలు తీసుకోవాలి. బోట్లలో ఏ ఒక్కరూ సముద్రంలోకి వెళ్లకుండా చూసుకోవాలి. తుపాను దృష్టిలో ఉంచుకొని ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలి. వర్షాలతో దెబ్బతినడానికి అవకాశం ఉన్న పంటల సేకరణలో వేగం పెంచాలి. కల్లాల్లో ఉన్న ధాన్యం వీలైనంత వరకు కొనుగోలు చేయాలని' జగన్ అధికారులను ఆదేశించారు.

# కరోనా కట్టడికి సర్కార్ కట్టుదిట్టమైన చర్యలు

### అయినా పెరుగుతున్న కేసుల సంఖ్య
### లాక్‌డౌన్ పొడిగింపుతో ఆర్థికంగా దివాళా
### తదుపరి చర్యలపై కెసిఆర్ తర్జనభర్జన
### నేటి కేబినేట్‌లో సుదీర్ఘంగా చర్చించే అవకాశం

హైదరాబాద్,మే4(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో కరోనా నివారణ చర్యలను తెలంగాణ ప్రభుత్వం కట్టుదిట్టంగా అమలు చేస్తున్నా మళ్లీ కరోనా కేసుల పెరుగుతు ండడం ఆందోళన కలిగిస్తోంది. నిజానికి లాక్‌డౌన్ 3తో ముగియనున్న దశలో దానిని 7వరకు పొడిస్తూ సిఎం కెసిఆర్ నిర్ణయించారు. ఈ మేరకు కేబినేట్‌లో చర్చించి ఆమోదించారు. పరిస్థితిని సమీక్షించి మళ్లీ 5న జరిగే కేబినేట్ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని కెసిఆర్ ప్రకటించారు. అప్పిటికీ ఇప్పటికీ పరిస్థితిలో పెద్దగా మార్పులు రాలేదు. సరికదా రెడ్‌జోన్ల సంఖ్య పెరగింది. ప్రతిరోజూ సిఎం పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఈ లోగా లాక్‌డౌన్‌ను కేంద్రం 17వరకు పొడించింది. అలాగే కొన్ని సడలింపులు ఇచ్చింది. తెలంగాణ సర్కార్ 7వరకు పెట్టిన గడువును మించి 17 వరకు పొడిగించారు. ఈ దశలో తదుపరి చర్యలపై కేబినేట్ చర్చించాల్సి ఉంది. మంగళవారం సిఎం కెసిఆర్ అధ్యక్షతన జరిగే కేబినేట్ దీనిపై చర్చించనుంది. తదుపరి చర్యలు ఎలా ఉండాలన్నదానిపై చర్చిస్తారు. అలాగే ఎలాంటి చర్యలు తీసుకోవాలో చర్చించనున్నారు. కాగా రాష్ట్రంలో కరోనా కట్టడి కోసం తీవ్రంగా శ్రమిస్తున్న నేపథ్యంలో కొన్ని రోజుల క్రితం వరకు కేసులు తగ్గుముఖం పడుతున్నట్లు అనిపించినప్పటికీ గత రెండు, మూడు రోజులుగా మళ్లీ కొత్త కేసులు వెలుగు చూస్తుండడం పట్ల సిఎం కెసిఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం నాటికి రాష్ట్రంలో మొత్తం కేసుల సంఖ్య 1082కు చేరుకున్నారు. కరోనా వైరస్ కారణంగా మొత్తం రాష్ట్రంలో 29 మంది చనిపోయారు. ప్రధానంగా జిహెచ్‌ఎంసి పెరిధిలోనే కేసుల సంఖ్యతో పాటు మరణాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో మరిన్ని కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సిఎం కెసిఆర్ భావిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వ మార్గ దర్శకాల మేరకు లాక్‌డౌన్‌లో పలు ఆంక్షలు ఇవ్వడమా? లేక పెరుగుతున్న కేసులను దృష్టిలో పెట్టుకుని యథావిధిగా లాక్‌డౌన్‌ను పొడగించడమా? అన్న అంశంపై సిఎం కెసిఆర్ చర్చించనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని హైదరాబాద్, వికారాబాద్, సూర్యాపేట్, వరంగల్ అర్బన్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలు రెడ్ జోన్ పరిధిలో ఉండగా, 17 జిల్లాలు ఆరెంజ్ జోన్, మరో 10 జిల్లాలు గ్రీన్‌జోన్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌జోన్‌లో ఉన్న ప్రాంతాల్లో పలు సడిలింపులను ఇచ్చింది. దీంతో పలు రాష్ట్రంలో జోరో కేసులు ఉన్న ప్రాంతాల్లో మద్యం విక్రయాలకు అనుమతులు ఇచ్చాయి. కాగా మన రాష్ట్రంలో కూడా వైన్స్ షాపులు తెరవాలన్న డిమాండ్ ప్రధానంగా వినిపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వానికి వస్తున్న ఆదాయంలో ప్రధానంగా ఎక్సైజ్ శాఖ నుంచే వస్తోంది. ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే ఉండడంతో కేంద్రం సూచించిన విధంగా గ్రీన్‌జోన్ల పరిధిలో మద్యం విక్రయాలను అనుమతులు ఇస్తే దాని ప్రభావం ఏ మేరకు ఉంటుందన్న అంశంపై కూడా లోతుగా సిఎం కెసిఆర్ చర్చించినట్లుగా తెలుస్తోంది. ఒకవేళ మద్యం విక్రయాలకు అనుమతులు ఇస్తే ఏ విధంగా ఇవ్వాలి? ఎన్ని గంటలకు పాటు అనుమతించాలి? అన్న అంశంపై కూడా అధికారులతో సిఎం చర్చించారు. ఈ అంశాలపై మంగళవారంనాడు జరిగే రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో మరోసారి చర్చించి సిఎం కెసిఆర్ తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న లాక్‌డౌన్ పరిస్థితులు, అమలు జరుగుతున్న తీరు, కరోనా నియంత్రణ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తదితర అంశాలపై సిఎం కెసిఆర్ ఇప్పటికే అధికారులతో చర్చించినట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో గత రెండు, మూడు రోజులుగా కేసుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో లాక్‌డౌన్ విషయంలో ఎలా ముందుకు సాగుదామన్న అంశంపై అధికారులతో సిఎం సుధీర్ఘంగా చర్చించారు. కేంద్రం లాక్‌డౌన్‌ను ఈ నెల 17వ తేదీ వరకు పొడగిస్తూనే కరోనా కేసులు లేని ప్రాంతాల్లో ఆంక్షలలో పలు సడలింపులను ఇచ్చింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోనూ లాక్‌డౌన్‌ను మరికొన్ని రోజులు పాటు పొడగించడమా? లేక పలు ఆంక్షలతో సడలింపులు ఇవ్వాలా? అన్న అంశంపై కేబినెట్ సమావేశంలో సిఎం లోతుగా చర్చించనున్నారు. అలాగే రాష్ట్రంలో కరోనా నియంత్రణ, వలస కార్మికుల తరలింపు, లాక్‌డౌన్‌పై కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన మార్గదర్శకాలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఈ నెల 5న కేబినెట్ భేటీలో చర్చించనున్నారు.

# వలస కార్మికులకు అండగా నిలిచిన కాంగ్రెస్

### స్వస్థలాలకు వెళ్లే వారి ఛార్జీలను భరిస్తామన్న సోనియా
### రైలు చార్జీలు వసూలు చేయాలన్న నిర్ణయంపై మండిపాటు
### ఆయా రాష్ట్రాల పిసిసిలు చార్జీలు భరిస్తాయని ప్రకటన

న్యూఢిల్లీ,మే4(ఆర్ఎన్ఎ): లాక్‌డౌన్ కారణంగా దేశంలోని పలు ప్రాంతాల్లో చిక్కుకుని అల్లాడుతున్న వలస కార్మికుల కోసం కాంగ్రెస్ పార్టీ సంచలన నిర్ణయం తీసుకుంది. వలస కార్మికుల ప్రయాణ ఖర్చులను ఆయా రాష్ట్రాలకు చెందిన కాంగ్రెస్ కమిటీలే భరిస్తాయని ఆ పార్టీ చీఫ్ సోనియా గాంధీ ప్రకటించారు. వలస కూలీలు, కార్మికులందరి రైలు ప్రయాణానికి అవసరమయ్యే ఖర్చులను స్థానిక కాంగ్రెస్ కమిటీలు భరించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. వారికి సాయం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని సోనియా గాంధీ పేర్కొన్నారు. కాగా వలస కార్మికుల కష్టాలకు కేంద్ర ప్రభుత్వ వైఖరే కారణమంటూ సోనియా నిప్పులు చెరిగారు. వారి కష్టం, త్యాగం, మన దేశానికి పునాది అని గుర్తుచేశారు. ఈ మేరకు ఆమె కేంద్రానికి లేఖ రాశారు. వలస కార్మికులే దేశానికి వెన్నెముక అనీ.. వారు ఇళ్లకు వెళ్లకుండా చిక్కుకుపోవడానికి కేంద్ర ప్రభుత్వమే కారణమని ఆమె ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం కేవలం 4 గంటలు సమయం ఇచ్చి లాక్‌డౌన్ విధించిందంటూ ఆమె మండిపడ్డారు. తోటి పౌరులైన వలస కార్మికుల సేవలను గౌరవిస్తూ వారికి సహకారం అందించాలని కాంగ్రెస్ నిర్ణయించింది. వారితో భుజం భుజం కలిపి నిలబడతాం అని సోనియా గాంధీ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా చిక్కుకున్న వలసకూలీలను ప్రత్యేక శ్రామిక్ రైళ్లలో స్వంత స్థలాలకు తరలిస్తున్నప్పటికీ ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే ప్రయాణఛార్జీలు భరించాలని కేంద్రం పేర్కొంది. అయితే కూలీల వద్ద రైల్వే టికెట్ వసూల్ చేస్తున్నారు. దీన్ని కాంగ్రెస్ పార్టీ తప్పుపట్టింది. వలస కూలీల టికెట్ల ఖర్చును తామే భరిస్తామని కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ తెలిపారు. దీనికి సంబంధించి ఆయా రాష్ట్రాలకు చెందిన ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలు అన్ని చర్యలు తీసుకుంటాయని ఆమె తెలిపారు. వలస కూలీల సేవలో ఇదో చిన్న సాయంగా భావిస్తామని కాంగ్రెస్ పార్టీ పేర్కొన్నది. విపత్కర సమయంలో వారికి సంఘీభావంగా నిలవనున్నట్లు సోనియా తెలిపారు. లాక్‌డౌన్ సమయంలో కేవలం నాలుగు గంటల సమయం మాత్రమే ఇచ్చారని, దీంతో వలస కూలీలు ఎక్కడికక్కడ చిక్కుకుపోయినట్లు కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. సంక్షోభ సమయంలో కూలీల నుంచి టికెట్ చార్జీలు వసూల్ చేయడం దారుణమని సోనియా అన్నారు. కూలీలను సురక్షితంగా స్వంత ప్రాంతాల్లో వదలడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. ఇప్పటికీ లక్షలాది మంది వివిధ ప్రాంతాల్లో చిక్కుకున్నట్లు ఆమె ఆరోపించారు. అహ్మదాబాద్‌లో జరిగిన నమస్తే ట్రంప్ ఈవెంట్‌కు జనాలను తీసుకువచ్చేందుకు వంద కోట్లు ఖర్చు చేశారని, పీఎం రిలీఫ్ ఫండ్‌కు రైల్వే శాఖ 151 కోట్లు ఇచ్చిందని, కానీ కూలీలను తరలించేందుకు వారి నుంచి టికెట్ ఛార్జీ వసూల్ చేయడం హేయంగా ఉందన్నారు.

### పీస్‌అండ్‌వెల్ఫేర్ కమిటి సహకారంతో వలస,దినసరి కార్మికులు,కడుబీదకుటుంబాలకు

# నిత్యావసరవస్తువులు,కూరగాయలను పంపిణి చేసిన కమీషనరేట్ పోలీసులు

### 3.5లక్షల విలువచేసే 650కిట్లు అందజేత



కరీంనగర్,మే4(నేటినిజం ప్రతినిధి): కరీంనగర్ పోలీస్కమీషనరేట్ పోలీసుల ఆధ్వర్యంలోకొనసాగుతున్న శాంతి, సంక్షేమ కమిటీ(పీస్‌అండ్‌వెల్ఫేర్) సహకారంతో పోలీసులు లాక్‌డౌన్ అమలుతో ఉపాధికరువై ఇబ్బందులు పడుతున్న వలస,దినసరి కార్మికులు, కడు బీదకుటుంబాలకు చెందిన ప్రజలకు నిత్యావసరవస్తువులు,కూరగాయలను పంపిణీ చేశారు. సోమవారంనాడు పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 3.5లక్షల విలువచేసే 650కిట్లను అందజేశారు. తమవంతు చేయూతనందించేందుకు ముందుకువచ్చిన శాంతి,సంక్షేమ కమిటి, రాబిన్‌హుడ్ సంస్థలకు చెందిన సభ్యులను అభినందించారు.

ఒక్కోకిట్‌లో 05కిలోల బియ్యం, ఒకకిలో పప్పు, ఒకకిలో వంటనూనె, రెండుకిలో ఉల్లిగడ్డలు, రెండుకిలోల ఆలుగడ్డలు, ఒకకిలో చక్కెర, పావుకిలో ఛాయపత్తి, రెండుసబ్బులతోపాటు వివిధరకాల కూరగాయలు ఉన్నాయి. గోపాలపురం గ్రామానికి చెందిన రైతు మంద రాజమల్లు తమవంతుగా 35వేల రూపాయల విలువచేసే 18క్వింటాళ్ళ కూరగాయలను ఉచితంగా అందజేశారు. పండించిన పంటను అమ్మడంతోపాటు వలస,దినసరికార్మికులు, కడుబీదకుటుంబాలకు ఉచితంగా కూరగాయలను అందించేందుకు ముందుకు వచ్చిన రైతు రాజమల్లును ప్రత్యేకంగా అభినందించారు. శాంతి,సంక్షేమకమిటి, రాబిన్‌హుడ్ సంస్థలకు చెందిన సభ్యులతో పాటు పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి, వివిధ విభాగాలకు చెందిన పోలీసు అధికారులు కొంతమొత్తాన్ని వ్యక్తిగతంగా అందజేశారు.

ఇందులోభాగంగా గోదాంగడ్డలో జరిగిన కార్యక్రమానికి మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ వై సునీల్‌రావు ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరోనా వైరస్‌వ్యాప్తి నియంత్రణ చర్యల్లో భాగంగా పోలీసులు రేయింబవళ్ళు అందించిన సేవలద్వారానే వ్యాప్తిని నియంత్రించగలిగామన్నారు. రాష్ట్రముఖ్యమంత్రి ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో పోలీస్ కమీషనర్‌ను అభినందించడం మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు.

ఈసందర్భంగా పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ కుల, మతవర్గవిభేదాలకు అతీతంగా అన్నివర్గాలకు చెందిన కార్మికులు, కడుబీదకుటుంబాలకు ఈ కిట్‌లను అందజేశామన్నారు. మున్సిపల్ అధికారుల సహకారంతో పైనపేర్కొన్న కుటుంబాలను గుర్తించామని పేర్కొన్నారు. శాంతి,సంక్షేమకమిటి సభ్యులు కార్మికులు,కడుబీదకుటుంబాలకు బాసటగా నిలించేందుకు ముందుకువచ్చి తమ ఐక్యతను చాటడం ఆహ్వానించదగిన పరిణామమని పేర్కొన్నారు. పోలీసు కళాబృందం ఇంఛార్జి రామంచ తిరుపతి ఆధ్వర్యంలో సభ్యులు కరోనా వైరస్‌వ్యాప్తి నిరోధకచర్యల్లో భాగంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వైద్యుల సూచనలపై అవగాహన కల్పిస్తూ రూపొందించిన పాటలు,నృత్యాలతో ప్రదర్శనలను నిర్వహించారు. కరీంనగర్‌లోని మధుగార్డెన్స్, మానేరుగార్డెన్స్, గోదాంగడ్డ, అయ్యప్ప ఆలయం, కిసాన్‌నగర్, కార్ఖానాగడ్డ ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి లుఎస్ శ్రీనివాస్( లాఅండ్‌ఆర్డర్), జి చంద్రమోహన్ (పరిపాలన) ఏసిపి పి అశోక్, ఇన్స్‌పెక్టర్లు విజయ్‌కుమార్, దేవారెడ్డి, విజ్ఞాన్‌రావులతోపాటుగా శాంతి, సంక్షేమ కమిటి, రాబిన్‌హుడ్ సంస్థలకు చెందిన సభ్యు లు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇవాళ కూడా జీరో కేసులే..ఇక మిగిలింది 34 మంది పేషెంట్లు

తిరువనంతపురం, మే 4: భారత్‌లో కొన్ని రాష్ట్రాల్లో కరోనా వైరస్ వ్యాప్తి చెందుతున్నప్పటికీ కేరళలో మాత్రం తగ్గుముఖం పడుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం కొత్తగా ఒక్క పాజిటివ్ కేసు కూడా నమోదుకాలేదని ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. అంతేకాదు ఇవాళ మరో 61 మంది కరోనా బాధితులు డిశ్చార్జ్ అయ్యారని మీడియా సమావేశంలో వెల్లడించారు. గత నాలుగు రోజుల్లో సున్నా కేసులు నమోదవడం ఇది మూడోసారి. ఆదివారం కూడా ఒక్కకేసు నిర్ధారణ కాలేదు.

ఇక ఆ రాష్ట్రంలో కేవలం 34 మంది మాత్రమే పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకు కేరళలో మొత్తం 499 పాజిటివ్ కేసులు నమోదు కాగా..సోమవారం సాయంత్రం వరకు 462 మంది కోలుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 84 హాట్‌స్పాట్లు ఉన్నాయి. దేశంలో వివిధ రాష్ట్రాల్లో చిక్కుకున్న లక్షన్నరకు పైగా కేరళీయులు రాష్ట్రానికి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా వివిద దేశాల్లో కరోనా వల్ల మృతిచెందిన 80 మందికి ముఖ్యమంత్రి సంతాపం ప్రకటించారు.

# రెడ్‌జోన్ పరిధిలో నెల్లూరు జిల్లా

### మండలాలు యూనిట్‌గా ఎపి సర్కార్ విభజన
### గ్రీన్‌జోన్‌లో సడలింపులతో ప్రజలకు ఊరట
### మద్యం కోసం బారులు తీరిన జనాలు

నెల్లూరు,మే4(ఆర్ఎన్ఎ): జిల్లాలను యూనిట్‌గా తీసుకుని నెల్లూరు జిల్లాను కేంద్ర ప్రభుత్వం రెడ్‌జోన్‌గా పరిగణించింది. అయితే రాష్ట్ర స్థాయిలో భౌగోళికంగా, జనాభా పరంగా జిల్లాల విస్తీర్ణం అత్యధికం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం మండలాలను యూనిట్‌గా తీసుకుని కరోనా పాజిటివ్ కేసుల లెక్కల ప్రకారం గ్రీన్, రెడ్‌జోన్ మండలాలను విభజించింది. లాక్‌డౌన్ పొడిగించిన నేపథ్యంలో గ్రీన్, ఆరెంజ్ జోన్లలో ఆంక్షల సడలింపునకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సడలించిన ఆంక్షలు సోమవారం నుంచి అమలులోకి వచ్చాయి. మద్యం విక్రయాలకు కంటైన్‌మెంట్ జోన్లలో మినహా మిగతా ప్రాంతాల్లో విక్రయించుకునేందుకు అనుమతులు ఇచ్చింది. దీంతో మద్యం దుకాణాల ముందు ప్రజలు బారులు తీరారు. ధరలు పెంచినా పెద్దగా పట్టించుకోకుండా క్యూలో నిలబడ్డారు. ఎండను సైతం లెక్క చేయకుండా కిలోమీటర్ మేర క్యూలో నిలబడ్డారు. ఇకపోతే రెడ్‌జోన్, కంటైన్‌మెంట్ జోన్లల్లో నిబంధనలు కఠినతరం చేయనున్నారు. నెల్లూరు సిటీ, నెల్లూరురూరల్, నాయుడుపేట, వాకాడు, తడ, అల్లూరు, ఇందుకూరుపేట, బాలాయపల్లి, బోగోలు, బుచ్చిరెడ్డిపాళెం, గూడూరు, కావలి, ఓజిలి, తోటపల్లిగూడూరు, కోవూరు మండలాలు రెడ్‌జోన్ పరిధిలో ఉన్నాయి. మిగిలిన 32 మండలాలు గ్రీన్, ఆరెంజ్ జోన్లలో ఉన్నాయి. కృష్ణపట్నంపోర్టు, విద్యుత్, ఆయిల్, నిత్యావసర సరుకుల పరిశ్రమలకు అనుమతి ఇచ్చింది. గ్రీన్, ఆరెంజ్ జోన్లల్లో నిత్యావసర సరుకుల షాపులు, మందుల షాపులు, అత్యవసర సేవలకు అనుమతి ఉంది. విద్యా సంస్థలు, సినిమా హాల్స్, షాపింగ్ మాల్స్ తదితర వాటికి మాత్రం అనుమతి లేదు. గ్రీన్, ఆరెంజ్ జోన్లలో నిత్యావసర సరుకులు, ఇతర వస్తువులు,. నాన్ ఎసెన్షియల్ వస్తువుల డెలివరీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అత్యవసర సరుకులు ఉత్పత్తి చేసే పరిశ్రమలు, మెడికల్, జూట్ మిల్లులు, ఐటీ హార్డ్‌వేర్ తదితర వాటికి అనుమతి ఇచ్చింది. పరిశ్రమల్లో

పని చేసే కార్మికులందరూ మాస్క్‌లు ధరించి సామాజిక దూరం పాటించాల్సి ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే అన్ని పరిశ్రమలకు సడలింపులు ఇచ్చింది. పట్టణ ప్రాంతాల్లో భవన నిర్మాణ పనులు స్థానికంగా ఉండే కూలీలతో చేయించుకోవాల్సి ఉంది. ప్రైవేట్ కార్యాలయాలు 33 శాతం మంది ఉద్యోగులతో కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చు. వైద్య సేవలు, ఐటీ సేవలు, ఇంటర్ స్టేట్స్, ఇంటర్ డిస్ట్రిక్ గూడ్సు సేవలు, నిత్యావసర వస్తువుల రవాణా, బ్యాంకింగ్, కొరియర్, పోస్టల్, అంగన్‌వాడీ కేంద్రాలు, అత్యవసర సర్వీసులకు అనుమతి ఉంది. రెడ్‌జోన్లలో నాన్ ఎసెన్షియల్ వస్తువుల విక్రయాలు, ఈ?కామర్స్ సంస్థలకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతి లేదు.

# చినగంజాంలో చిక్కుకున్న వసల కార్మికులు

### -అదుకుంటున్న రెవెన్యూ అధికారులు

విశాఖపట్టణం,మే4(ఆర్ఎన్ఎ): రైల్వే పనుల నిమిత్తం పొరుగు రాష్ట్రాల నుంచి చినగంజాం వచ్చి చేరిన పలువురు వలస కార్మికులు తమను స్వస్థలాలకు చేర్చాలంటూ ఆదివారం అధికారులను ఆశ్రయించారు. ప్రస్తుతం లాక్‌డౌన్ సడలింపుల్లో భాగంగా అంతర్ రాష్ట్ర వలస కూలీలను వారి స్వస్థలాలకు పంపేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుండటంతో స్థానికంగా కూలి పనిచేస్తున్న పొరుగు రాష్ట్రాల కూలీలు తమను స్వస్థలాలకు చేర్చాలంటూ అధికారులను కలిసి వేడుకున్నారు. దక్షిణ మధ్యరైల్వే మూడవ రైల్వే లైన్ నిర్మాణ పనుల నిమిత్తం ఇతర రాష్ట్రాల నుంచి సుమారు 49 మంది పలు కుటుంబాల వారు చినగంజాంలోని రైల్వే స్టేషన్ పరిసరాల్లో కొంత కాలంగా తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకొని నివాసముంటున్నారు. వీరిలో మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బీహార్‌కు చెందిన పలు కుటుంబాలు వారు చంటి పిల్లలతో సహా ఉంటున్నారు. గత మార్చిలో కరోనా లాక్‌డౌన్ దృష్ట్యా రైల్వే పనులు పూర్తిగా నిలిచిపోవడంతో కూలీలను ఇక్కడకు తీసుకొని వచ్చిన కాంట్రాక్టర్ వారిని ఇక్కడే వదలి వెళ్లిపోయాడు. గడచిన 40 రోజులుగా తహసీల్దార్ కేవీఆర్‌వీ ప్రసాదరావు వారిని గుర్తించి సాయమందిస్తూ ఆదుకుంటుండగా, స్థానికులు, దాతలు వారికి కావాల్సిన నిత్యావసర వస్తువులు అందజేస్తూ వచ్చారు. తహసీల్దార్, ఎస్ఐ పి.అంకమ్మరావు సుమారు 49 మంది కూలీలు స్థానికంగా స్వస్థలాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు గుర్తించారు. వారిని స్వస్థలాలకు పంపే ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

# మద్యం ధరల పెంపు పేదలకు భారమే

### నాటుసారా ఏరులై పారుతున్నా పట్టింపేది?
### యనమల రామకృష్ణుడు విమర్శ

అమరావతి,మే4(ఆర్ఎన్ఎ): కరోనాతో అనేక మంది అనారోగ్యం పాలవుతుంటే.. వైకాపా ప్రభుత్వం మాత్రం ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతోందని టిడిపి సీనియర్ నేత, మాజీమంత్రి యనమల రామకృష్ణుడు విమర్శించారు. రాష్ట్రంలో మద్యం ధరల పెంపు నిర్ణయాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. మద్యం ధరల పెంపు పేదల రక్తం పిండుకోవడమేనని మండిపడ్డారు. కరోనా వైరస్ నేపథ్యంలో ప్రజలపై రూ.5వేల కోట్ల భారం మోపడం గర్హనీయమన్నారు. మద్యం కంపెనీల ఒత్తిళ్ల మేరకే ఇప్పుడీ ధరల పెంపు నిర్ణయం తీసుకున్నారని ఆయన ఆరోపించారు. ఇప్పటికే రాష్ట్రంలో నాటుసారా ఏరులై పారుతోందని.. నాసిరకం మద్యం అమ్మకాలు పెగిరిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. వైకాపా నాయకులు నాటుసారా తయారీ వెనుక ఉండి వాలంటీర్ల ద్వారా అమ్మకాలు జరుపుతున్నారని యనమల ఆరోపించారు. ఒకవైపు కరోనా వైరస్ విజృంభిస్తున్న నేపథ్యంలో దేశమంతా లాక్‌డౌన్ కొనసాగుతున్నా ఏపీలో మాత్రం అక్రమ మద్యం అమ్మకాలు పేట్రేగాయని యనమల విమర్శించారు. గతంలో ఎలుకలు ఇనుము తిన్నాయని కథల ద్వారా విన్నామని.. ప్రస్తుతం వైకాపా పాలనలో ఎలుకలు మద్యం తాగటాన్ని చూస్తున్నామని దుయ్యబట్టారు. ఎన్నికల సమయంలో రాష్ట్రంలో దశలవారీగా మద్యం నిషేధిస్తామని మేనిఫెస్టోలో చెప్పారని ఆయన గుర్తు చేశారు. నమ్మి ఓట్లు వేసిన ప్రజలను వైకాపా ప్రభుత్వం దారుణంగా మోసం చేసిందని మండిపడ్డారు. మద్యం ధరల పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని యనమల ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

# పోలీస్ కమీషనరేట్ కేంద్రంలో రసాయనాలతో పిచికారీ

కరీంనగర్,మే4(నేటినిజం ప్రతినిధి):కరీంనగర్ కమీషనరేట్ కేంద్రంలో ఆదివారం నాడు మున్సిపల్‌శాఖ సహకారంతో సోడియం హైపోక్లోరైడ్, ఇతర రసాయనాలతో పిచికారీ చేశారు. కరోనా వైరస్‌వ్యాప్తి నియంత్రణలో భాగంగా ఈ రసాయనాలను ఉపయోగించి ఈ పిచికారీ నిర్వహించారు.

కమీషనరేట్‌కేంద్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు, హెడ్‌క్వార్టర్స్‌లోని వివిధ ప్రాంతాలు, గోదాంగడ్డవద్దగల పోలీస్‌క్వార్టర్లలో ఈ పిచికారీ నిర్వహించారు. అనంతరం ఆయా ప్రాంతాలను కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

**10వేల చెక్కు అందజేత**

కరోనా వైరస్‌వ్యాప్తి నియంత్రణలో భాగంగా రేయింబవళ్ళు విధులను నిర్వహిస్తున్న సేవలను గుర్తించి వారికి కావాల్సిన వివిధ రకాల వస్తువుల కొనుగోలు కోసం మన తెలంగాణ మ్యారేజీ బ్యూరో అసోసియేషన్ సభ్యులు పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డికి 10వేల రూపాయల చెక్కును అందజేశారు.

ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు కొమ్మ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మెల్ల శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి శీలం శ్రీనివాసరావు, కార్యదర్శి దొంత రాజేందర్, కో-ఆర్డినేటర్ మాసం రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.




సైబరాబాద్ కమిషనర్ సజ్జన్నార్‌కు ఇమ్యూనిటీ పెంచే మందులను పంపిణీ చేసిన హోమియో ఇంటర్నేషనల్ సభ్యులు

# కరోనా కట్టడిలో పోలీసుల కృషి అమోఘం

### పూలు చల్లి అభినందించిన మంత్రి ఎర్రబెల్లి



వరంగల్,మే4(ఆర్ఎన్ఎ): లాక్‌డౌన్‌ను విజయవంతం చేస్తున్న పోలీసులను మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అభినందించి సత్కరించారు. వారు ఎండనకా పగలనకా డ్యూటీలు చేస్తూ కరోనాను కట్టడి చేశారని అన్నారు. వారి సేవలు నిరుపమానమని అన్నారు. సోమవారం ఉదయం వరంగల్ పోలీస్ కమిషనర్ రవీందర్‌పై పూలు చల్లి, శాలువతో మంత్రి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుండా ప్రకాశ్ రావు, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, మున్సిపల్ కమిషనర్ పమేలా సత్పతి పాల్గొన్నారు. కరోనా మహమ్మారిపై పోరులో విజయవంతంగా పనిచేస్తున్న వరంగల్ అర్బన్ జిల్లా ఉన్నతాధికారులను మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సన్మానించారు. వరంగల్ నగర పోలీస్ కమిషనర్ రవీందర్, జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, నగర మున్సిపల్ కమిషనర్ పమేలా సత్పతిలకు మంత్రి ఎర్రబెల్లి శాలువాలు కప్పి, పూలు చల్లి సత్కరించారు. తొర్రూరు జిల్లా పర్యటనలో భాగంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొర్రూరు మండలం మాటేడులో పలువురు దాతలు అందించిన నిత్యావసరాలను పేదలకు పంపిణీచేశారు. అనంతరం తొర్రూరులో చాంబర్ ఆఫ్ కామర్స్, శారదా న్యూల్ ఆధ్వర్యంలో నమకూర్చిన నిత్యావసరాలను కూడా మంత్రి ఎర్రబెల్లి తన చేతుల మీదుగా పంచిపెట్టారు. అనంతరం తొర్రూరు అతిథి గృహంలో దీప డిజిటల్స్ అనిల్ అందించిన నిత్యవసరాలను పేపర్ బాయ్స్‌కు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ.. లాక్‌డౌన్ వేళ నిరుపేదలను ఆదుకోవడానికి ముందుకొచ్చిన దాతలకు అభినందనలు చెప్పారు. పేదలను ఆదుకోవడానికి ఇది సరైన సమయని, ప్రస్తుత పరిస్థితుల్లో ఇంకా చాలామంది ముందుకు రావాలని ఆయన సూచించారు. ఆర్థికంగా ఎంత నష్టం వాటిల్లినా సరే ప్రజల ప్రాణాలు రక్షించడమే ముఖ్యమనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ లాక్‌డౌన్ కొనసాగిస్తున్నారని మంత్రి చెప్పారు.

# తెలంగాణలో కరోనా నియంత్రణ చర్యలు భేష్

### మతిలేని మాటలు మాట్లాడుతున్న ఉత్తమ్
### మంత్రి జగదీశ్వర్ రెడ్డి విమర్శ

సూర్యాపేట,మే4(ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్ తీసుకున్న లాక్ డౌన్ నిర్ణయాలతో పాటు కరోనా కట్టడికి తీసుకుంటున్న చర్యల వల్లే తెలంగాణలో కరోనా అదుపులో ఉందని మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. లాక్‌డౌన్ పక్కాగా అమలు చేయడం, సకాలంలో స్పందించడం వంటి చర్యలతో తెలంగాణలో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. టిపిసిసి అధ్యక్షుడు, ఎంపి ఉత్తమ్ కుమార్ రెడ్డిపై వ్యాఖ్యలపై మంత్రి కౌంటర్ ఇచ్చారు. పరీక్షలు నిర్వహిస్తినే పాజిటివ్ కేసులు సంఖ్య పెరుగుతోందన్నారు. పరీక్షలు ఎక్కడ నిర్వహించాలో ఉత్తమ్ చెబితే బాగుంటుందని జగదీష్ ఎద్దేవా చేశారు. నిర్దేశిత ప్రాంతాన్ని ఉత్తమ్ గుర్తిస్తే బయటకు చెప్పాలన్నారు. ఉత్తమ్ వ్యాఖ్యలతో ప్రజల్లో భయం పెరిగేలా ఉందన్నారు. తెలంగాణలో కరోనా టెస్టులు ఎందుకు తగ్గించారని ఉత్తమ్ ప్రశ్నించిన విషయం తెలిసిందే. తెలంగాణలో ఇప్పటి వరకు 1082 కేసులు నమోదు కాగా 29 మంది మృత్యువాతపడ్డారు. భారత్ దేశంలో కరోనా బాధితులు సంఖ్య 42,793కు చేరుకోగా 1396 మంది చనిపోయిమతిలేని మాటలు మాట్లాడుతున్న ఉత్తమ్‌మంత్రి జగదీశ్వర్ రెడ్డి విమర్శూరు. పప్రంచంలో 35.81 లక్షల మందికి కరోనా వైరస్ వ్యాపించగా 68 వేలకు పైగా మంది మరణించారు. ఇదిలావుంటే సూర్యాపేట జిల్లాకు భారీగా శానిటైజర్స్, మాస్క్‌లను ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు మంత్రి జగదీశ్ రెడ్డి సమక్షంలో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి కి మూడువేల లీటర్ల శానిటైజర్స్, మూడు వేల మాస్క్‌లను అందజేశారు. తన తండ్రి నామా ముత్తయ్య ట్రస్ట్-మధుకాన్ షుగర్స్ ద్వారా అందజేసినట్లు ఎంపీ తెలిపారు. కరోనా నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి కి తోడుగా స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావడం గొప్ప విషయమని విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. ఎంపీ నామా కరోనా కట్టడికి చేస్తున్న కృషిని ప్రశంసించారు. అందరం కలిసి కట్టుగా పని చేస్తే కరోనా మహమ్మారిని పారద్రోలవచ్చున్నారు.కాంగ్రెస్ హయాంలో విత్తనాల కొనుగోలు దగ్గరి నుంచి పంటను అమ్ముకునే వరకు రైతులు పడిన ఇబ్బందులు వర్ణనాతీతం. రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసి వారం తిరుగక ముందే మద్దతు ధర చెల్లించిన చరిత్ర ప్రపంచం లో తెలంగాణ లో తప్ప మరెక్కడా లేదని మంత్రి జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. కరోనా టెస్టుల విషయంలో పీసీసీ చీఫ్ ఉత్తమ్ మతిలేని మాటలు మాట్లాడుతున్నాడన్నారు.రాష్ట్రంలోనే అత్యధిక పరీక్షలు చేసిన జిల్లాగా సూర్యాపేట నిలిచిందన్న విషయం మర్చిపోవద్దన్నారు. ఉత్తమ్ అండ్ కో ఉనికి కోనమే ఆరాటపడుతున్నారని తీవ్ర స్థాయి లో దుయ్యబట్టారు. కరోనా లక్షణాలు ఉన్న వ్యక్తుల సమాచారమిస్తే కచ్చితంగా పరీక్షలు జరుపుతామన్నారు. లాక్‌డౌన్ ఎత్తివేసిన తర్వాత కూడా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకొని కరోనా కట్టడిలో భాగస్వామ్యం కావాలన్నారు.

# ఎపిలో తెరుచుకున్న మద్యం దుకాణాలు

### ఉత్సాహంగా రోడ్డెక్కిన మందు ప్రియులు
### ధరలు పెంచినా లెక్క చేయకుండా క్యూ కట్టిన మందుబాబులు
### తమిళనాడు సరిహద్దుల్లో ఉద్రిక్తత..దుకాణాల మూసివేత
### తిరుపతిలో మహిళల ఆందోళన
### ధరల పెంపును సమర్థించుకున్న ప్రభుత్వం

అమరావతి,మే4(ఆర్ఎన్ఎ): ఎపిలో మద్యం షాపులు తెరుచుకున్నాయి. ఎన్నాళ్లో వేచిన ఉదయం అంటూ ..మందుబాబులంతా రోడ్డున పడి మందు కోసం క్యూ కట్టారు. క్యూ కిలోమీర్ మేర ఉన్నా సామాజిక దూరం పాటిస్తూ నిలుచున్నారు. కొన్నిచోట్ల మహిళలు తమ భర్తల కోసం క్యూల్లోకి వచ్చి మందును కొనుగోలు చేశారు. లాక్ డౌన్ సడలింపుల్లో భాగంగా వైన్ షాపులు తెరిచేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో ఆంధ్రప్రదేశ్‌లో సోమవారం ఉదయం 11గంటలకు మద్యం షాపులు తెరుచుకున్నాయి. దీంతో మందుబాబులు ఉదయం నుంచే మద్యం షాపులవద్ద క్యూలో నిలబడ్డారు. దీంతో కొన్ని చోట్ల క్యూ లైన్లు కిలోమీటర్లమేర పెరిగాయి. రాత్రి 7 గంటల వరకు మద్యం విక్రయాలు కొనసాగనున్నాయి. సుదీర్ఘ విరామం తర్వాత వైన్ షాపులను తెరుస్తూనే ఏపీ ప్రభుత్వం మద్యం ధరలను 25శాతం పెంచింది. అయినా మందుబాబులు వెనుకడుగు వేయడంలేదు. కిక్ కోసం బారులుతీరారు. గుంటూరు జిల్లా నందివెలుగులో అయితే ఓ వైన్ షాపు వద్ద ఏకంగా 4 కి.మీ. మేర క్యూ పెరిగింది. ఎండ ఠారెత్తిస్తున్నా మద్యం కోసం పడిగాపులు కాస్తున్నారు. కొన్ని చోట్ల అయితే చెప్పులు లైన్‌లో ఉంచారు. ఇదిలావుంటే ఆంధ్రప్రదేశ్- తమిళనాడు సరిహద్దుల్లో సోమవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. మద్యం అమ్మకాలకు అనుమతి ఇవ్వడంతో.. నెల్లూరు జిల్లాలోని తడ మండలం బీవీ పాలెం, రామాపురం ప్రాంతాల్లోని మద్యం షాపుల వద్దకు తమిళులు భారీగా చేరకుంటున్నారు. ఒక్కసారిగా తమిళులు పెద్ద ఎత్తున చేరుకోవడంతో వైన్ షాపుల వద్ద తోపులాట చోటుచేసుకుంది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు మద్యం షాపులను మూయించి పరిస్థితిని అదుపులోని తీసుకువచ్చారు. అలాగే చిత్తూరు జిల్లాను ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో

తమిళనాడుకు చెందిన మద్యం ప్రియులు ఆంధ్రాకు క్యూ కట్టారు. తమిళనాడులో మద్యం అమ్మకాలు జరగకపోవడంతో... అక్కడినుంచి మందుబాబులు చిత్తూరు జిల్లా పాలసముద్రానికి తరలిచ్చారు. మద్యం కొనుగోలు కోసం దుకాణాల మందు బుద్ధిగా బారులు తీరి మరీ నిలుచున్నారు. దాదాపు 40 రోజుల తర్వాత షాపులు ఓపెన్ కావడంతో మందుబాబులు క్యూకట్టారు. మద్యం ప్రియుల రద్దీతో దుకాణాలన్నీ కిటకిటలాడుతున్నాయి. తమిళనాడు, తెలంగాణ సహా పలు రాష్ట్రాలు మాత్రం లాక్‌డౌనన్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నాయి. ఆయా రాష్ట్రాల్లోమద్యం దుకాణాలకు అనుమతినివ్వలేదు. పక్కనే ఉన్న ఏపీలో మద్యం అమ్మకాలు ప్రారంభం కావడంతో తమిళనాడు, తెలంగాణ సరిహద్దులోని మందుబాబులు అక్కడికి క్యూలు కడుతున్నారు. తమిళనాడు నుంచి చిత్తూరుకు పెద్ద ఎత్తున మందుబాబులు తరలివస్తున్నారు. తమిళనాడు సరిహద్దుల్లో ఉన్న చిత్తూరు జిల్లా పాలసముద్రంలో మద్యం దుకాణం తెరచుకోవడంతో తమిళనాడు ప్రాంతవాసులు ఇక్కడికి తరలివచ్చారు. వైన్ షాప్ ముందు స్థానికులతో పాటు తమిళనాడు వాసులు కూడా క్యూకట్టారు. అయితే... విషయం అధికారులకు తెలియడంతో... అక్కడ మద్యం అమ్మకాలను నిలిపివేయాలని తమిళనాడు తహసీల్దార్లు ఏపీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. దాంతో చిత్తూరు జిల్లా అధికారులు పాలసముద్రంలో మద్యం అమ్మకాలను నిలిపివేశారు. కాగా... తమిళనాడు నుంచి రాకుండా చర్యలు తీసుకోవాలని గానీ.. ఇక్కడ మద్యం షాపులను మూసివేయడమేమిటని మద్యం బాబులు ఆక్షేపిస్తున్నారు. ఇకపోతే తిరుపతి నగరంలోని రేణిగుంట మండలం పాపానాయుడుపేట వద్ద సోమవారం మహిళలు ఆందోళనకు దిగారు. ఇళ్ల మధ్యలో ఉన్న బ్రాందీ షాప్‌లను మూసివేయాలని వారు డిమాండ్ చేశారు. దీంతో వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు పరిస్థితి అదుపు చేశారు. పోలీసుల జోక్యంతో మూడు మద్యం షాపులను తాత్కాలికంగా మూసివేశారు. చిత్తూరు జిల్లాలో మద్యం దుకాణాలు తెరుచుకున్నాయి. జిల్లాలోని కంటోన్మెంట్ ప్రాంతాలు మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. చిత్తూరు ఎక్సైజ్ జిల్లా పరిధిలో 160 దుకాణాల్లో అమ్మకాలు చేపట్టారు. కాగా జిల్లాలో ఎక్కడ కూడా సామాజిక భౌతిక దూరం పాటించని పరిస్థితి నెలకొంది.




సిద్దిపేట జిల్లా చందలాపూర్‌లో రంగనాయకసాగర్ ప్రధాన కాల్వను ప్రారంభించి పరిశీలించిన మంత్రి హరీస్ రావు. ఉత్సాహంగా కాల్వలో ఈతలు కొట్టిన యువత

# పిల్ల కాలువ పనులను పరిశీలించిన మంత్రి

సిద్దిపేట,మే4(ఆర్ఎన్ఎ): సిద్దిపేట జిల్లా చందలాపూర్‌లో ప్రధాన ఎడమ కాలువ కింద పిల్ల కాలువ పనులను రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ మేరకు సోమవారం ఉదయం మంత్రి హరీశ్ కొబ్బరికాయలు కొట్టి పూజచేశారు. అనంతరం ప్రధాన కాలువ వెంట మంత్రి కలియతిరిగారు. చందలాపూర్ ప్రధాన ఎడమకాలువ నుంచి పిల్ల కాలువ తీయడం ద్వారా చిన్న కోడూర్, బెల్లంకుంట, పెద్ద చెరువు నిండనున్నదని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. ఈ సందర్భంగా సిద్దపేట ప్రధాన కాలువలకు గోదావరి జలాలు రావడంతో స్థానిక యువత ఆనందంతో ఈతలు కొడుతుండటాన్ని మంత్రి గమనించారు. ఏం బిడ్డా కాలువల్లో ఈతలు కొడుతున్నారా..? అంటూ వారిని ఆప్యాయంగా పలుకరించారు. మంత్రి వెంట స్థానిక నతులు ఉన్నారు. గోదావరి జలాలు రావడాన్ని ఆయన స్వాగతిస్తూ కల నెరవేరిందన్నారు.

# పేకాట రాయుళ్ల అరెస్ట్

వేములవాడ, మే 4 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ పట్టణం లో నిన్న రాత్రి ఏడుగురు వ్యక్తులు కలిసి పేకాట ఆడుచుండగా వేములవాడ టౌన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ రఫిక్ ఖాన్ మరియు సిబ్బంది కలిసి పట్టుకొని కేసు నమోదు చేశారు. ఏడుగురు వ్యక్తులు వేములవాడకు చెందిన వారు కలిసి పేకాట ఆడుచుండగా రఫీక్ ఖాన్ వారిని మరియు నగదు రూపాయలు.16, 000/- స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. లాక్ డౌన్ కారణం గా ఎవరు కూడా ఇళ్ళనుండి బయటకు రావద్దు అని మరియు సమూహంగా గుమి గూడా వద్దు అని చెప్పిన కూడా వినకుండా ఇలాంటి పనులు చేస్తే చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకుంటాం అని రఫీక్ ఖాన్ తెలిపారు.

# ఏం మునిగిందని వైన్ షాపులు తెరిచారు?

### జగన్ తాబేదారులంతా మద్యం సిండికేట్లే
### మండిపడ్డ సిపిఐ కార్యదర్శి నారాయణ

అమరావతి,మే4(ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి జగన్ తాబేదారులు సారాయి సిండికేట్‌లుగా ఉన్నారని, వారికి లాభం చేకూర్చడం కోసమే ఏపీలో మద్యం దుకాణాలు తెరుస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ధ్వజమెత్తారు. మద్యం తాగడం వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తి తగ్గిపోతుందన్నారు. తద్వారా కరోనా విజృంభిస్తుందని నారాయణ చెప్పుకొచ్చారు. ఇలాంటి సమయంలో ఏం కొంప మునిగిందని మద్యం షాపులను ఓపెన్ చేస్తున్నారని ప్రభుత్వాన్ని నారాయణ ప్రశ్నించారు. జనం తాగి ఆనందంగా చనిపోవాలని చూస్తున్నట్లుగా జగన్ వైఖరి ఉందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వైన్ షాపులు తెరవాలనే నిర్ణయాన్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. దేశంలో లాక్‌డౌన్ ఉన్నంత వరకు మద్యనిషేధం అమల్లో ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. జనం బాధల్లో ఉన్న సమయంలోనూ మద్యం రెట్టు పెంచడం శవాల మీద చిల్లర వేరుకోవడమేనని వ్యాఖ్యానించారు. లాక్‌డౌన్‌కు ముందు, లాక్‌డౌన్ తరువాత పరిశీలిస్తే కరోనా కేసులు భారీగా తగ్గాయని, అందుకు మద్యనిషేధమే ప్రధాన కారణం అని నారాయణ పేర్కొన్నారు. కరోనా నివారణ విషయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆలోచనలోనే లోపం ఉందని నారాయణ విమర్శించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఏపీ సీఎం జగన్.. ఇద్దరిదీ ఒకే వైఖరని మండిపడ్డారు. వీరిద్దరికీ ఫ్యాక్టరీలు కావాలి, లాభాలు కావాలి, జీడీపీ పెరగాలి.. కానీ ప్రజల ఆరోగ్యం మాత్రం బాగుండొద్దని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

# యనమలదంతా కమీషన్ల కక్కుర్తి

### -మండిపడ్డ మంత్రి బొత్స

విజయనగరం,మే4(ఆర్ఎన్ఎ): కమిషన్లకు కక్కుర్తిపడిన యనమల.. ఇప్పటికీ అదే గుణంతో ప్రభుత్వాన్ని తప్పుపడుతున్నారని టీడీపీ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడిపై మంత్రి బొత్స సత్యనారాయణ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. లక్ష బెడ్ల ఆర్డర్లు ఇవ్వడంపై యనమల ప్రశ్నించిన నేపథ్యంలో ఆయన ఫైర్ అయ్యారు. గ్రామ సచివాలయంలో పది బెడ్లు పెట్టకపోతే ఊర్లో ఇళ్లు అద్దెకు తీసుకుని క్వారంటైన్‌కి బెడ్లు వేసి వినియోగిస్తామని మంత్రి చెప్పుకొచ్చారు. ఇదే సమయంలో విజయనగరం గ్రీన్ జోన్ అంశంపై స్పందించిన మంత్రి బొత్స.. గ్రీన్ జోన్‌గా ఉన్న జిల్లాను కాపాడటం కోసం అనేక చర్యలు తీసుకుంటు న్నామని తెలిపారు. ఇందులోభాగంగా ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు దుకాణాలు తెరవటానికి అనుమతి ఇచ్చామని తెలిపారు. అదేవిధంగా మద్యం దుకాణాలు ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 6 వరకు తెరిచి ఉంటాయన్నారు. ఆటోలపై తిరగటానికి ఇద్దరు ప్రయాణికులకు అనుమతి ఇచ్చామన్నారు. రాత్రి 7 నుండి ఉదయం 7 వరకు యధావిధిగా కర్ఫ్యూ అమల్లో ఉంటుందని మంత్రి బొత్స వివరించారు. అయితే ఉదయం 7 నుండి రాత్రి 7 వరకు ప్రజలు భౌతిక దూరం పాటిస్తూ రోడ్లపై తిరగవచ్చునని బొత్స తెలిపారు.

# ఇదే అత్యధికం..24 గంటల్లో 1,074 మంది రికవరీ

న్యూఢిల్లీ, మే 4: భారత్‌లో గడచిన 24 గంటల్లో కరోనా నుంచి 1,074 మంది కోలుకున్నారని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ వెల్లడించింది. సోమవారం వరకు మొత్తం 11,706 కోలుకొని డిశ్చార్జ్ అయ్యారు. దేశంలో ఇప్పటి వరకూ ఒక్క రోజులో ఇంత ఎక్కువ స్థాయిలో కోవిడ్-19 నుంచి బాధితులు కోలుకోవడం ఇదే తొలిసారి అని పేర్కొంది. ప్రస్తుతం భారత్‌లో కరోనా రికవరీ రేటు 27.52 శాతంగా ఉన్నట్లు ప్రకటించింది. గత 24 గంటల్లో కొత్తగా 2,553 పాజిటివ్ కేసులు నమోదయ్యాయని, మొత్తం కేసుల సంఖ్య 42,533కు పెరిగిందని తెలిపింది. ప్రస్తుతం వివిధ ఆస్పత్రుల్లో 29,453 మంది చికిత్స పొందుతున్నారు.

# వలస జీవుల సహాయార్థం టి.ఆర్.కె సహాయ నిధి...

### -రూ. 2 లక్షల చెక్కు అందజేత....



వేములవాడ, మే 4 (నేటినిజం ప్రతినిధి):లాక్ డౌన్ లో ఉపాధి కరువై తినడానికి తిండి లేక వలస జీవుల కుటుంబాలకు టి ఆర్ కే చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు తోట రామ్ కుమార్ సహాయార్థం సోమవారం రెండు లక్షల రూపాయల చెక్కు ను కరీంనగర్ మంత్రి గంగుల కమలాకర్ కు అందించారు.

గత కొన్ని రోజులుగా మంత్రి గంగుల కమలాకర్ వలస కుటుంబాలకు అండగా ఉంటూ ప్రతి రోజు అన్నదాన కార్యక్రమాలు చేపడుతున్నారు.

ఇందులో భాగంగా ప్రముఖ ఎన్నారై టి ఆర్ కె ట్రస్ట్ వ్యవస్థాపకులు తోట రామ్ కుమార్ విషయం తెలుసుకుని వెంటనే వలస కుటుంబాల సహాయార్థం రెండు లక్షల రూపాయల చెక్కు ను అందజేశారు.

ఈ కార్యక్రమంలో గోలి రవి, ఉప్పుల వేణు, ఉప్పుల సంపత్, టి.ఆర్.కె చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ మొట్టల మహేశ్ కుమార్, ప్రధాన కార్యదర్శి నాయిని శేఖర్, సభ్యులు తోట దీపక్ లు ఉన్నారు.

# వలస జీవులకు బాసటగా నిలవండి !

### - మానవతా దృక్పథంతో నిరుపేదలను ఆదుకోవాలి...
### - కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్



వేములవాడ, మే 4 (నేటినిజం ప్రతినిధి):రెక్కాడితే కానీ...డొక్కాడని వలస కుటుంబాలకు తమ వంతు సహాయంగా నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తూ... మానవత్వాన్ని చాటుకుంటుచాటుకు లని వేములవాడ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం వర్గం ఇన్చార్జ్ ఆది శ్రీనివాస్ అన్నారు .

సోమవారం కోనరావుపేట మండలం లోని సుద్దాల గ్రామంలో ఉపాధి నిమిత్తం బీహార్ నుండి వలస వచ్చిన నిరుపేదలైన నిస్సహాయులకు నిత్యావసర సరుకులను ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు

మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు కచ్చకాయల ఎల్లయ్య, అంబోజి లక్ష్మీనారాయణ, నాయకులు గంగయ్య, బుచ్చి రాములు, శ్రీనివాస్, రమేష్, ఎంపీటీసీలు పాషా, ప్రవీణ్, మాజీ సర్పంచ్ బాల్ రెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు

అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గత నలభై రెండు రోజుల నుండి లాక్ డౌన్ కొనసాగుతున్న నేపథ్యంలో ఉపాధి లేక అల్లాడుతున్న కుటుంబాలకు తమవంతు సహాయంగా నిత్యావసర సరుకులను పంపిణీ చేశామన్నారు. ప్రభుత్వం ఇప్పటికే 12 కిలోల బియ్యాన్ని, 1500 రూపాయల నగదును అందించిందని, కానీ కొందరికి అనివార్య కారణాల వల్ల నగదు అందలేదని, వెంటనే ప్రభుత్వం వారికి 5వేల రూపాయల నగదుతో పాటు 12కిలోల బియ్యాన్ని మే మాసం లోపే అందించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే తెలుపు రేషన్ కార్డు లేని వారిని గుర్తించి వెంటనే ప్రభుత్వం తరఫున తొమ్మిది రకాల నిత్యావసర సరుకుల పంపిణీ చేయాలని ఆయన కోరారు. అలాగే నియోజకవర్గంలోని కాంగ్రెస్ కార్యకర్తలు మానవతా దృక్పథంతో లాక్ డౌన్ వల్ల ఉపాధి లేక అల్లాడుతున్న నిరుపేదలకు సహాయం చేయాలని తెలిపారు.

# వలస కార్మికుల విషయంలో కేంద్రానికి రోడ్ మ్యాప్ ఏదీ

### మండిపడ్డ మంత్రి సత్యవతి రాథోడ్



వలస కూలీలకు మాస్కులు అందజేస్తున్న రాష్ట్ర గిరిజన సంక్షేమ, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్

మహబూబాబాద్,మే4(ఆర్ఎన్ఎ): వలస కూలీల విషయంలో కేంద్రం ఒక రోడ్ మ్యాప్ ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వాలకు వదిలేసిందని రాష్ట్ర గిరిజన సంక్షేమ, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ఆరోపించారు. తొలిసారి లాక్‌డౌన్‌ను అమలు చేసినప్పుడే వలస కూలీలను ఎక్కడివాళ్లను అక్కడకు తరలిస్తే బాగుండేదని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం తాము ఇక్కడ పనిచేసుకుంటామన్న వారిని ఇక్కడే ఉంచి వెళ్తామన్న వారిని పంపిస్తున్నామని మంత్రి చెప్పారు. ప్రైవేటు బస్సులు పెట్టి వారిని గమ్యస్థానాలకు చేరుస్తున్నామన్నారు. జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు బయలుదేరిన పలువురు వలస కార్మికులకు ఆమె వీడ్కోలు పలికారు. మండలాల వారీగా వలస కార్మికులను గుర్తించడానికి నోడల్ ఆఫీసర్లను నియమించామని మంత్రి తెలిపారు. అదేవిధంగా రైస్ మిల్లర్లు రైతులకు నష్టం వచ్చేలా చేయొద్దని మంత్రి సత్యవతి రాథోడ్ కోరారు. వంటలో కోత ఎక్కువగా పెడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, కరోనాను అవకాశంగా తీసుకుని రైతులకు అన్యాయం చేయొద్దని హెచ్చరించారు. తాలు పేరుతో మిల్లర్లు రైతులను నష్టపర్చకుండా చూడాలని మహబూబాద్ కలెక్టర్‌ను, ఇతర అధికారులను మంత్రి ఆదేశించారు.

# కంటైన్‌మెంట్ జోన్లలో ఆంక్షలు కొనసాగింపు

### -పర్యాటక శాఖ మంత్రి అవంతి శ్రీనివాస్

విశాఖపట్నం,మే4(ఆర్ఎన్ఎ): కంటైన్‌మెంట్ జోన్లలో ఆంక్షలు కొనసాగుతాయని.. మిగతా ప్రాంతాల్లో ఉదయం ఆరు గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు లాక్‌డౌన్ సడలింపులు ఉంటాయని పర్యాటక శాఖ మంత్రి అవంతి శ్రీనివాస్ తెలిపారు. విశాఖ జిల్లాలో లాక్‌డౌన్ మినహాయింపులపై ఆయన అధ్యక్షతన జరిగిన టాస్క్ ఫోర్స్ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. చిన్నషాపులు, దినసరి కూలీలు, కార్మికుల ఉపాధికి ఇబ్బందులు లేకుండా కార్యకలాపాలు కొనసాగిస్తూనే కరోనా నియంత్రణ చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా భవన, నిర్మాణ రంగ కార్మికులకి.. ఇతర కార్మికులకి పనులు కల్పించేలా నిర్ణయించారు. వారికి అవసరమైన కార్యకలాపాలు, పనులు నిర్వహించుకునేలా వెసులుబాటు ఇవ్వాలని నిర్ణయించడంతో పాటు లాక్ డౌన్ సడలింపులు, మినహాయింపులపైనా సమావేశంలో చర్చించారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com